రాజీవ్ యువ వికాస పథకంపై ప్రచారం చేయండి

- ఎక్కువమంది దరఖాస్తు చేసుకునేలా చూడాలని వీసీలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి

రాజీవ్ యువ వికాస పథకానికి వీలైనంత ఎక్కువమంది అర్హులు దరఖాస్తులు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం రాజీవ్ యువ వికాసం పథకంపై హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర వెనకబడిన తరగతుల నిరుద్యోగ యువత ఆర్థికంగా ఎదిగేందుకై ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు



నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ముంబాజీపేట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. బాన్సువాడ మండలంలోని సిద్దాపూర్ గ్రామానికి చెందిన గోపాల్ కుస్తీ పోటీలో విజేతగా నిలిచాడు. రెండో విజేతగా బీర్కూరు మండలం మిర్జాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గెలుపొందారు. వీరికి ముంబాజీపేట్ గ్రామ పెద్దలు వెండి కడియం ప్రథమ బహుమతి, 1000 రూపాయలు ద్వితీయ బహుమతిని విజేతలకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రం కిష్టయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరత్ నాయక్, మండల యూత్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్, గ్రామ పెద్దలు కోరి పెద్ద నారాయణ, గ్రామ అధ్యక్షుడు బోయిని రాములు, గ్రామస్తులు యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

- జిల్లా పంచాయతీ అధికారి మురళి
- కిందిస్థాయి అధికారులతో, సిబ్బందితో సమన్వయం చేస్తున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-కామారెడ్డి



డీపీవో మురళి

జిల్లా వ్యాప్తంగా ఎక్కడ నీటి సమస్య వచ్చినా వెంటనే ఎంపీడీవో, ఎంపీవో, కార్యదర్శులు స్పందించి నీటి సమస్యను పరిష్కరిస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి మురళి అన్నారు. కిందిస్థాయి అధికారులతో, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ నీటి ఎద్దడి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. వేసవి నీటి ఎద్దడి అధిగమించే ప్రణాళికలపై డీపీవోతో నవతెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ నిర్వహించింది. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

సాధారణంగా ఒక్కో వ్యక్తి రోజువారి అవసరాలు తీర్చుకునేందుకు ప్రతి రోజు 100 లీటర్ల నీరు అవసరం పడుతుంది. ఈ లెక్కను పరిగణలోకి తీసుకొని.. గ్రామాల్లో జనాభా ఆధారంగా ఉన్న నీటి వనరుల లభ్యత చూసుకుంటూ నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటు న్నట్టు తెలిపారు. జూన్ చివరి వరకు జిల్లాలో ఎక్కడ నీటి సమస్య రాకుండా చూసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని, ఇందుకోసం సిబ్బందితో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న చోట.. అక్కడక్కడ బోరు బావులను సైతం లీజుకు తీసుకొని వాటి నుంచి నీటిని గ్రామాలలో అందించేందుకు ట్యాంకర్ ద్వారా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పశువులకు నీటి తొట్టిలు, పక్షుల కోసం చిన్న చిన్న మగ్గులు ఏర్పాటు చేసి నీటిని నింపి పెట్టాలని గ్రామ కార్యదర్శులకు ఇది వరకే సూచించాము. ఉపాధి హామీలో ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీటిని పోయాలని అధికారు లకు సూచించారు.

స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు అక్కడక్కడ పశువుల కోసం, పక్షుల కోసం నీటిని అందించేందుకు ముందుకు రావాలని కోరారు. పశువుల కోసం నీటి తొట్టిలను, పక్షులకు మగ్గులను, వాటర్ బాటిళ్లలో నీళ్లు నింపి అక్కడక్కడ చెట్లకు కట్టాలన్నారు. ఈ ఉగాది అనంతరం పక్షులకు, జంతువులకు నీటిని అందించే పనులు వేగవంతం అవుతాయని తెలిపారు.

వరికి బోనస్ చెల్లించడంలో కామారెడ్డి మొదటి స్థానం

- జిల్లా సివిల్ సప్లై మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న రాజేందర్

రాష్ట్ర ప్రభుత్వం సన్నవడ్లకు 500 బోనస్ అమలు చేసింది. దానిని అమలు చేయడంలో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందని జిల్లా సివిల్ సప్లై మార్కెటింగ్ మేనేజర్ రాజేందర్ అన్నారు. గతంలో వడ్లు కొనుగోలు చేసేందుకు ఐకెపికి 27 సెంటర్లను ఇచ్చినట్టు, ప్రస్తుతం ఆ సెంటర్లను 156కు పెంచినట్టు తెలిపారు. గతంలో జిల్లా వ్యాప్తంగా 424 కొనుగోలు కేంద్రాలు ఉండగా ప్రస్తుతం అదనంగా 22 పెంచినట్టు తెలిపారు. ప్రస్తుతం కామారెడ్డి జిల్లావ్యాప్తంగా వ్యవసాయ అధికారుల అంచనా ఆరు లక్షల ఇరవై వేల క్వింటాళ్ల ధాన్యం వస్తుందని అంచనా వేసినట్టు తెలిపారు. ప్రభుత్వం అంచనా ప్రకారం ఐదు లక్షలు క్వింటాళ్ల వరకు ధాన్యం వస్తుందని పేర్కొన్నారు. ఏ రకం ధాన్యానికి రూ.2320, బీ రకం ధాన్యానికి రూ.2300 ప్రభుత్వం మద్దతు ఇస్తుందన్నారు. ఇందుకు మ్యాచర్ 17 రావాలన్నారు. రైతులు ప్రభుత్వమిచ్చే మద్దతు ధరతోపాటు సన్నబడ్లకు బోనస్ పొందాలని రైతులకు సూచించారు.

సామరస్యం, కరుణ..రంజాన్

- రంజాన్ వేడుకలతో నగరంలో కిటకిటలాడిన ఈద్గాలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి





శుభాకాంక్షలు తెలియజేసుకున్న పిల్లలు.. ప్రార్థనలు చేస్తున్న చిన్నారులు



నమాజు చేస్తున్న ముస్లింలు

నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు ఆదివారం నెలవంక కనిపించడంతో సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. శాంతి సామరస్యాలకు ప్రతీక అయిన రంజాన్ పండుగను నిజామాబాద్ జిల్లాలో ప్రత్యేక ప్రార్థనలతో ఘనంగా నిర్వహించారు. రంజాన్ సందర్భంగా ఈద్గాలు, మసీదుల్లో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా రంజాన్ వేడుకలు...

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈద్- ఉల్-ఫితర్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఎక్కడ చూసిన పండుగ సందడి కనిపించింది. నూతన వస్త్రాలను ధరించి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ సమీపంలో ఉన్న కచియ మసీదులో ఉదయం 8 గంటల నుంచి, జిల్లా ప్రాంగణంలో గల జామా మసీదులో ఉద యం 8 గంటల 30 నిమిషాల నుంచి, సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఖురాన్ పఠనం చేశారు. ఈద్ ముబారక్ అంటూ కుటుంబ సభ్యులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రత్యేక వంటకాలు పాయసం, షీర్ కుర్మా విందు ఏర్పాటు చేశారు. రంజాన్ రోజు ప్రత్యేకంగా పేద ప్రజలకు దానధర్మాలు చేస్తే సకల శుభాలు కలుగుతాయని భావించి కొందరు ముస్లింలు పేదవారికి బట్టలు, బియ్యం దానం చేశారు. జాకర్త పేరిట ప్రతి సంవత్సరం పేదవాళ్లకు బట్టలు, నిత్యావసర సరుకులు దానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. నెల రోజుల పాటు ప్రతి రోజు దానధర్మాలు చేయడం వల్ల తెలియక చేసిన పాపాలు తొలగిపోతాయని ముస్లిం సోదరులు విశ్వసిస్తారు. ఉపవాస దీక్షను విరమించి, ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని ముస్లిం సోదరులు ఆకాంక్షించారు. జిల్లాలో ఈద్గాలు, మసీదులు ప్రత్యేక ప్రార్థనలలతో సందడిగా మారాయి. ముస్లిం సోదరులు కొత్త బట్టలు ధరించి, సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. వీధుల వెంట అలాయ్ బలాయ్ తీసుకోవడంతో రంజాన్ పండుగ సందడిగా మారింది.

రంజాన్ సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రంజాన్ పండుగ సందర్భంగా ఉదయం సమయంలో నిజామాబాద్‌లో పలు ప్రదేశాలలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం పర్యవేక్షించారు. 5 టౌన్ పరిధిలోని శాంతినగర్ ఈద్గా, వన్ టౌన్ పరిధిలో గల కచ్చియా మస్జిద్ వద్ద, శంభుడిగుడి పరిసర ప్రాంతాలలో, 2టౌన్ పరిసర ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటును, బోధన్ లోని ఈద్గా బందోబస్తు ఏర్పాటును క్షుణ్ణంగా పర్యవేక్షించారు. కార్యాక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఏసిపి రాజా వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ట్రాఫిక్ ఏసిపి నారాయణ, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని తైసిల్ మస్జిద్ దగ్గరలోని షాహి ఈద్గా వద్ద రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పర్వదినం సందర్భంగా ప్రత్యేక ప్రార్థన (నమాజ్) లో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి రంజాన్ పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ముస్లింల పర్వదినం రంజాన్ అని ప్రపంచవ్యాప్తంగా రంజాన్ సంబరాలను పేదలు ధనవంతులు అన్న సంబంధం లేకుండా అందరూ కలిసి కొత్త బట్టలు ధరించి విందులు చేసుకుంటారన్నారు. ప్రతి పండుగ వెనుక పరమార్థం ఉంటుందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయాలను గుర్తుచేసుకోవడం, చరిత్ర గతి మార్చిన వీరులను స్మరించుకోవడం పర్వదినాల్లో సర్వసామాన్య అంశమని, వీటితో పాటు మనిషికి క్రమశిక్షణ నేర్పి, ధర్మాన్ని, దయాగుణాన్ని ప్రబోధించే పండగలో రంజాన్ ఒకటి అన్నారు.

ముస్లింలకు అతి పెద్ద పండగ ఇది. ఇస్లాం ధర్మానికి మూలమైన ఖురాన్ రంజాన్ నెలలో అవతరించిందన్నారు. ఈ పండుగ వెనక మానసిక, శారీరక వికాసం వంటి మరెన్నో ఎన్నో విశేషాలు కూడా ఉన్నాయి. నెలవంక దర్శనంతో మొదలై, మళ్లీ నెలవంక దర్శనంతోనే ముగిసే ఈ పర్వదినం ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయురారోగ్యాలతో అందరు కలిసిమెలిసి ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. మన సమాజంలో సామరస్యం, కరుణ స్ఫూర్తిని పెంపొందించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ప్రతి ఒక్కరి అద్భుతమైన ఆరోగ్యం, శ్రేయస్సు కోసం నేను ప్రార్థిస్తున్నా అని అందరికీ ఈద్ ముబారక్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన రాజీవ్ యువ వికాసం పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంలో జిల్లా కలెక్టర్ ఎస్పీ ప్రభుత్వ అధికారులు షబ్బీర్ అలీని కలిసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.







కామారెడ్డిలో రంజాన్ వేడుకల్లో షబ్బీర్ అలీతో పాటు పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీ తదితరులు.. నిజామాబాద్‌లో శుభాకాంక్షలు తెలియజేస్తున్న నుడా చైర్మన్, నరాల రత్నాకర్.. బందోబస్తు పర్యవేక్షిస్తున్న సీపీ

రెఫరెన్స్ ఉంటేనే సీఎంఆర్ఎఫ్

- స్థానిక నాయకుల పేర్లు, వివరాలు ఉంటేనే ఆస్పత్రి బిల్లులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు ప్రతిపాదన
- అన్ని నియోజకవర్గాల్లో ఓ లెక్క.. ఆ నియోజకవర్గంలో మాత్రం మరో లెక్క
- తీవ్ర ఇక్కట్లు పడుతున్న పేదలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



సీఎం రిలీఫ్ ఫండ్.. వివిధ కారణాలతో ఆస్పత్రుల పాలైన పేద ప్రజలకు ఆర్థికంగా భరోసా నింపేందుకు ఆస్పత్రి బిల్లులను మంజూరు చేస్తుంటారు. ఇందుకోసం పార్టీలకతీతంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు సదరు ఫామ్‌లు వెళ్తుంటాయి. అక్కడ ఆస్పత్రి బిల్లులను పరిశీలించి చెక్కులు మంజూరు చేస్తే.. వాటిని ఎమ్మెల్యేలు, నాయకులు తదితరులు లబ్దిదారులకు అందజేస్తుంటారు. అన్ని నియోజకవర్గాల్లో దాదాపు ఇదే విధంగా కొనసాగుతుండగా.. ఓ నియోజకర్గంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా సాగుతున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆ నియోజకవర్గంలో దరఖాస్తు చేసేవారు స్థానిక నాయకులతో రెఫరెన్స్ రాయించుకురావాలని మెలిక పెడుతుం డటం గమనార్హం. దీంతో పేదలకు సకాలంలో చెక్కులు అందక.. ఆస్పత్రి బిల్లులకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సదరు నియోజకవర్గంలో అధికార పార్టీలో రెండు గ్రూపులు ఉండటంతో ఎవరికి వారు తమ పెత్తనం సాగించాలని చూస్తున్నారు. ఇందుకోసం సీఎంఆర్ఎఫ్ సైతం వినియోగించుకుంటున్నారు. దరఖాస్తు చేసుకున్న పేదలు ఏ గ్రూప్‌నకు సంబంధించిన వారో తెలుసుకునేందుకు స్థానిక గ్రామ, మండల నాయకులతో రెఫరెన్స్ రాయంచుకురావాలని ఎమ్మెల్యే క్యాంప్ కార్యా లయం నుంచి సూచనలు వస్తున్నాయి. రాజకీయాలకు అతీతంగా ఉంటున్న పలువురు.. ఎవరితో రిఫరెన్స్ రాయించుకు రాలేకపోతున్నారు. దీంతో మీకు ఎవరూ పరిచయం లేదా అంటూ క్యాంప్ కార్యాలయంలో వారికి అవహేళనలు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాలో మిగతా ఏ నియోజకరవ్గంలోనూ ఇలా స్థానిక నాయకులతో రెఫరెన్స్ లేకున్నా.. ఇక్కడ మాత్రం రెఫరెన్స్ అడుగుతుండటం గమనార్హం. చెక్కులు మంజూరయ్యే సమయంలో లబ్దిదారులకు నాయకుల ద్వారా సమాచారం ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ.. దరఖాస్తులో ఇది వరకే రోగి వివరాలు, వారి కుటుంబీకుల వివరాలు ఉంటున్నాయి. గ్రూప్ రాజకీయాలు మాని ఇప్పటికైనా మిగతా నియోజకవర్గాల్లో లాగా ఇక్కడ సైతం ఎలాంటి రెఫరెన్స్‌లు లేకుండా పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించి ఇవ్వాలని సదరు నియోజకవర్గంలోని పేదలు కోరుతున్నారు.

పోలీస్ నిబంధనలు పాటించాలి

- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

నవతెలంగాణ-కంఠేశ్వర్



తోటి ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ప్రవర్తించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని సీపీ సాయిచైతన్య తెలిపారు. పోలీస్ నియమ నిబంధనలు పాటించాలని అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియమనిబంధనలకు సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. 'ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్ఠించరాదు. ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది. ఎక్కువశబ్దంతో డి.జేలను ఏర్పాటుచేయరాదని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని' తెలిపారు.

'రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డిజేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డిజేలు, సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమీషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమీషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమీషనర్ అనుమతి తీసుకోవాలి. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు, ఎస్‌ఐలకు ఉత్తర్వులను జారీచేశారు. ఇట్టి ఉత్తర్వులు తేదీ:01-04-2025 నుండి తేది 15-04-2025 వరకు అమలులో ఉంటుంది. కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్ అధికారులకు సహకరించగలరు.

సేంద్రియసాగుతో మేలు

- ఈ పంటలకు ప్రత్యేక నమోదు
- రైతులే నేరుగా విక్రయించుకునేలా మార్కెట్ డైరెక్ట్ లింకేజీ
- రైతులతో కేంద్ర ఉద్యానవన శాఖ అధికారుల సదస్సు
- త్వరలో 'నిజామాబాద్ జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ అర్గనైజేషన్' ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న అధికారులు

సేంద్రియ సాగుతో అటు భూమికి, ఇటు రైతులకు మేలు కలుగుతుందని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలక్టరేట్ ప్రాంగణం లో భారత ప్రభుత్వ సేంద్రియ, సహజ వ్యవసాయ ప్రాంతీయ కేంద్రం నాగపూర్ వారు ఉద్యాన శాఖ, తెలంగాణ ప్రభుత్వం వారి సమన్వయంతో ఒక రోజు సేంద్రీయ, సహజ వ్యవసాయం పైన రైతులకు శిక్షణ, క్షేత్ర ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్య అతిథిగా ఉద్యానవన శాఖ మాజి సంచాలకులు వెంకటామి రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ కేంద్రం శాస్త్రవేత్త ప్రవీణ్.. సేంద్రియ, సహజ వ్యవసాయం వల్ల కలిగే లాభాలు ఆ పద్ధతిలో సాగు చేసే రైతుల కోసం భారత ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అలగే సేంద్రియ పద్ధతిలో సాగు చేసే పంట నమోదు, ధ్రువికరణ విధానం వివరించి దానికి కావాల్సిన వివిధ పత్రాల గురించి చెప్పారు. తరువాత ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్-ఎఫ్‌పీవో) విశిష్టత, దాని సాధక బాధకలు వివరించారు. అలాగే త్వరలో జిల్లాలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ నియోజకవర్గ రైతులతో 'నిజామాబాద్ జిల్లా ఫార్మర్ ప్రొడ్యూసర్ అర్గనైజేషన్' ఏర్పాటు చేసి రైతులకి మార్కెట్ డైరెక్ట్ లింకేజి విధానంలో పంట అమ్మెలాగా ఎఫ్‌పీవో ద్వారా ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎఫ్‌పీవో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లడుతూ నాగపూర్ నుండి జిల్లా కేంద్రం వరకు వచ్చి ఇక్కడి రైతులకు సేంద్రీయ వ్యవసాయం పైన శిక్షణ ఇచ్చినందుకు వారికి కృతజ్ఞతలు చెప్పారు. అలాగే వారితో సమన్వయం చేసుకున్న ఉద్యాన శాఖ, శాఖ సీనియర్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇదే విధంగా భవిష్యత్తు లో కూడా జిల్లా రైతులకు ఇంకా ఎన్నో శిక్షణ మరియు క్షేత్ర కార్యక్రమలు నిర్వహించి వారి అభివృద్ధికి తోడ్పడాలని ఉద్యాన శాఖ, ఇతర శాఖల అధికారులని కోరారు.

చివరగా ముఖ్య అతిధి వెంకట్రామి రెడ్డి మాట్లడుతూ ఇంత మంచి శిక్షణ కార్యక్రమానికి నిజామాబాద్ జిల్లా వేదిక కావడం చాలా సంతోష కారమని అన్నారు. ఈ విధంగా శిక్షణ తీసుకున్న రైతులు తప్పకుండా మెల్లిమెల్లిగా అయినా సేంద్రియ మరియు సహజ వ్యవసాయ పద్ధతిని అవలంబించుకోవాలని ఆకాంక్షించారు. అలాగే త్వరలో ఏర్పాటు అయ్యే నిజామాబాద్ జిల్లా ఫార్మర్ ప్రొడ్యుసర్ ఆర్గనైజేషన్‌లో రైతులు ఆసక్తి చూపించి సభ్యత్వం తీసుకొని అంచెలచెలుగా ఆ ఎఫ్‌పీవోను అభివృద్ధి చేసి నిజామాబాద్ జిల్లా రైతులను ఆరోగ్యంగా మరిదు ఆర్థికంగా అభివృద్ధి పరచాలని తెలిపారు. ఈ కార్యకమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ అధికారి శ్రీనివాస్, ఉద్యాన శాఖ అధికారులు సాయిబాబా, నర్సయ్య, రోహిత్, వినాయక్ జిల్లా లోని వివిధ ఎఫ్‌పీవో డైరక్టర్లు, జిల్లా రైతులు పాల్గొన్నారు.



హాజరైన పలువురు రైతులు, నాయకులు

పశుసంపదను పెంచడమే లక్ష్యం

జిల్లా పశువైద్యాధికారి సంజయ్ కుమార్

నవతెలంగాణ-కామారెడ్డి



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

జిల్లాలో పశుసంపదను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు జిల్లా పశువైద్యాధికారి సంజయ్ కుమార్ అన్నారు. నవతెలంగాణతో ప్రత్యే ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో 52 వెటర్నరీ హాస్పిటల్, 6 ఎస్ఎస్ వెటర్నరీ హాస్పిటల్, ప్రైమరీ వెటర్నరీ హాస్పిటల్స్ 30, సబ్ సెంటర్స్ 16 వరకు ఉన్నాయన్నారు. జిల్లాలో ఏఎస్ఎన్ హాస్పిటల్స్ కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి, మద్నూర్, దోమకొండలలో ఉన్నాయని తెలిపారు. ప్రైమరీ వెటర్నరీ ఆసుపత్రులలో బీబీపేట్, సదాశివనగర్, పిట్లం తదితరచోట్ల డాక్టర్ల పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. సబ్ సెంటర్ 16 ఉండగా అందులో ఆరు కాళీలు ఉన్నాయని, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. జిల్లాలో గేదెలు సుమారుగా 79,261, ఆవులు, ఎద్లు 64,171, కోళ్లు 17లక్షల13 వెలు, మేకలు 1,63,764, గొర్రెలు 5 లక్షల 72వేలు, పందులు 3200, కుక్కలు 19 ఉన్నట్లుగా పేర్కొన్నారు. నిరుద్యోగులకు ఉపాధి కోసం ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3లక్షలతో మరిన్ని 10 పశుసంపదలు పెరిగే అవకాశం ఉంది తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునికి సన్మానం

నవతెలంగాణ-మోపాల్



నూతనంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మామిడ్ల సాయరెడ్డిని సోమవారం ఒలంపిక్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఈగ సంజీవ్ రెడ్డి బోర్గం (పి) లోని తన స్వగృహంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయరెడ్డి స్వహృదయుడు, సౌమ్యుడు అని మున్ముందు మరిన్ని పదవులు వరించాలని అన్నారు. అలాగే సేవా కార్యక్రమలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బోర్గం గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు ఈగ నర్సారెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గదారి సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహర్బిన్ హందన్‌ను నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులు మామిళ్ల సాయరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అధ్యక్షులును ఉర్దూ అకాడమీ చైర్మన్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ శోభాయాత్ర

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని బట్టాపూర్ గ్రామంలో తాండవాసులు సంత్ సేవాలాల్ మహరాజ్ శోభాయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండవాసులు మాట్లాడుతూ... తమ ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్, జగదాంబ మాతను భక్తిశ్రద్ధలతో పూజించి,డప్పు వాయిద్యాలతో ప్రతి సంవత్సరం బోగ్ బండార్ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, శివ, హరి సింగ్, రాజేష్, సతీష్, నితిన్, జీవన్, అనిల్, దేవేంధర్, రవి, తిరుపతి నాయక్ , తదితరులు పాల్గొన్నారు.

ఈగ రమేష్‌రెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మోపాల్

బోర్గం(పి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఈగ రమేష్ రెడ్డి అన్నయ్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని సోమవారం రోజున రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మునిపల్లి సాయిరెడ్డి, శేఖర్ గౌడ్, భాస్కర్ రెడ్డి తదితరులు వెంట ఉన్నారు

గుంజిలిలో దేవత విగ్రహాల ఊరేగింపు



ఆలయంలో ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని గుంజిలి గ్రామంలో శ్రీ రామాలయ ప్రతిష్ఠాపన సందర్భంగా సోమవారం దేవత విగ్రహాల ఊరేగింపు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ కమిటీ అధ్యక్షులు గోపు రంజిత్ తెలిపారు. సోమవారం సాయంత్రం దేవత విగ్రహాల ఉరేగింపు, గ్రామ పొలిమేర నుండి మంగళహారతులతో అగ్ని ప్రతిష్ఠ, గణపతి హవనం నిర్వహించారు. నేటి నుంచి నాలుగు రోజుల పాటు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

జిఎస్‌డిపి నిధుల లక్ష్యం చేరుకున్న భీంగల్ మున్సిపాలిటీ



మున్సిపల్ సిబ్బందిని అభినందిస్తున్న కమిషనర్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

15వ ఆర్థిక సంఘం 2025-26 సంవత్సరానికి నిధులు పొందడానికి జిల్లాలో అర్హత సాధించిన మొదటి మున్సిపాలిటీగా భీంగల్ మున్సిపాలిటీ నిలిచింది. గత ఆస్తి పన్ను లక్ష్యంపై 12.09శాతం అధికంగా వసూలు చేయడం మూలంగా జిఎస్‌డిపి ప్రకారం 15వ ఫైనాన్స్ నిధులు రావడానికి లక్ష్యాన్ని చేరుకున్నట్టు భీంగల్ మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. గత సంవత్సరం 2023-2024 ఆర్థిక సంవత్సరం 69శాతం వసూలు చేయగా ప్రస్తుత సంవత్సరం 77శాతం వసూలు చేసినట్టు వివరించారు. ఈ ఆస్తి పన్ను వసూలు చేయడానికి కృషి చేసిన ఆఫీస్ సిబ్బందికి, వార్డు ఆఫీసర్లకు, బిల్ కలెక్టర్‌కు ఆస్తిపన్ను చెల్లించిన పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు.

భూములను అమ్మివేసే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

- భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో భూములను ప్రైవేటు సంస్థలకు అమ్మివేసే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని యుఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు గణేష్ అన్నారు. సోమవారం భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ జిల్లా నగర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని గత ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేసిందని, నియంతృత్వాన్ని, అహంకారాన్ని ప్రదర్శించిందని ప్రచారం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు అంతకంటే ఎక్కువగా తెలంగాణ రాష్ట్రంలో నిర్బంధాన్ని, అహంకారన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. దానిలో భాగంగానే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూములని కార్పొరేట్ సంస్థలకు వేలం వేయాలనే నిర్ణయాన్ని తీసుకున్నారన్నారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పది రోజులుగా విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు అత్యంత దుర్మార్గంగా వ్యవహరించి వాఖ్యలు చేశారన్నారు. విద్యార్థులపైన అక్రమ కేసులు పెట్టకుండా వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు సజన్, వరదరాజ్, రాకేష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కోఆర్డినేటర్ల నియామకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జై బాపు జై భీమ్ జై సంవిదాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 02 నుండి ఏప్రిల్ 11 వరకు నిర్వహిస్తున్న రాజ్యాంగ పాదయాత్రలకు నిజామాబాద్ జిల్లాలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్‌ను కోఆర్డినేటర్లుగా నియమించినట్టు నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి సోమవారం తెలిపారు. తాహెర్‌బిన్ హందాన్ నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గలకు కో ఆర్డినేటర్‌గా నగేశ్ రెడ్డి బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల కో ఆర్డినేటర్‌గా, శేఖర్ గౌడ్-నిజామాబాద్ అర్బన్, బాన్సువాడ నియోజకవర్గాల కో ఆర్డినేటర్ గా నియమించినట్టు తెలిపారు.

నిధులు రాలే.. పనులు సాగలే..

- తొమ్మిదేళ్లుగా నిలిచిన ఎత్తిపోతల పనులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ఆయకట్టు రైతులు
- నిధులు రాక నిలిచిన పనులు



నవతెలంగాణ-మాక్లూర్

పొలాలకు సాగు నీరు అందించడానికి ఎన్నికల ముందు ప్రగల్భాలు పలుకుతూ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకునే వారు కరువయ్యారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన, ఎంత మంది నాయకులు మారిన రైతుల అవసరాలు మాత్రం తీరడం లేదు.

అర్గుల్ రాజారాం (గుత్ప) ఎత్తిపోతల పథకం పనుల పూర్తికాకపోవడంతో స్థానిక రైతులు పాలకుల పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకానికి



సుమారు రూ. 24 కోట్ల వ్యయంతో అనాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటి విడత పనులు ప్రారంభించి సుమారు తొమ్మిదేళ్లయిన నిధుల కేటాయింపులో జాప్యం వల్ల పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం మొదటి విడతకుగాను రూ. 11.90 కోట్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా ఆర్మూర్, మాక్లూర్, నిజామాబాద్ రూరల్ పరిధిలోని జక్రాన్ పల్లి మండలాల్లో సుమారు 13 గ్రామాలకు గుత్ప నీటిని అందించడానికి 2016లో అప్పటి మంత్రి మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన జరిగినప్పటినుండి ఇప్పటివరకు కేవలం 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. గుత్పలో మోటర్ల బిగింపు, చెరువు వద్ద తవ్వకం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే మాక్లూర్ మండల పరిధిలో సుమారు 13 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. గుత్ప ఎత్తిపోతల విస్తరణలో మండల పరిధిలో గుత్ప, మామిడి పల్లి, చిన్న పూర్, దాస్‌నగర్, మాక్లూర్, మదాపూర్, ముల్లంగి(బీ), బొంకన్ పల్లి, బోర్గం-కే, మాణిక్ బండార్, అమ్రాద్, ముత్యం పల్లి, ఒడ్డాట్ పల్లి, మదన్‌పల్లి గ్రామాలు ఈ ఎత్తిపోతల పథకం పరిధిలోకి వస్తాయి. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసింది. కనీసం ఇప్పుడైనా పనులు ముందుకు సాగుతాయని రైతులు అనుకుంటున్నారు.

ఎమ్మెల్యేల పరిశీలన.. పనులు సాగని వైనం..

ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే సైతం లిఫ్టు పనులను పరిశీలించారు. ఇకనైనా పనులు సాగుతాయని రైతులు అనుకున్నారు. కానీ పనులు ముందుకు సాగలేదని రైతులు వాపోతున్నారు. కనీసం ఇప్పుడైనా ఎమ్మెల్యేలు నజర్ ఉంచి పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

పనులు త్వరిగతిన పూర్తి చెయ్యాలి...

కాంగ్రెస్ ప్రభుత్వం గుత్ప ఎత్తిపోతల పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి తమకు మేలు చెయ్యాలని రైతులు కోరుతున్నారు. తొమ్మిదేళ్లుగా పనులు సాగుతూనే ఉన్నాయని వెంటనే పూర్తి చెయ్యాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ పనులు 2019 ఫిబ్రవరిలోనే పూర్తి చేయాల్సి ఉండగా, అధికారుల జాప్యంవల్ల పనులు అర్ధంతరంగా ఆగిపోవాల్సి వచ్చిందని మండిపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

నిధుల విడుదల జాప్యంతోనే నిలిచిన పనులు..

ప్రభుత్వం మొదటి విడతలో రూ. 11.90 కోట్లు మంజూరు చేసింది. అందులో ఇప్పటి వరకు రూ. 10 కోట్లు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ. కోటి 90 లక్షలు రావాల్సి ఉంది. పనులు మాత్రం 80 శాతం పూర్తయ్యాయి. ఆర్అండ్‌బి, అటవీశాఖ, రైల్వేశాఖ నుంచి అనుమతి వస్తే మిగతా పైపు లైన్ పూర్తవుతుంది.

- ఎత్తిపోతల లిఫ్టు-ఏఇ ప్రవీణ్

జంగం అశోక్ సేవలు అభినందనీయం

- స్వగ్రామంలో ఘనంగా సన్మానం

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్



మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు జంగం అశోక్ గ్రామానికి అందించిన సేవలు అభినందనీయమని గ్రామస్తులు సోమవారం కొనియాడారు. 35 సంవత్సరాల పాటు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందించిన జంగం అశోక్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా గ్రామంలో గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన స్నేహితులు, గ్రామస్తులు మాట్లాడుతూ చదువుతోనే భవిష్యత్తు ఉంటుందని, అందరూ చదువుకొని ఉన్నత స్థానంలో ఉండాలని ఎల్లప్పుడూ గ్రామస్తుల అభివృద్ధి కోరుకున్నారని అన్నారు. స్నేహితులతో కలిసి గ్రామంలో ప్రగతి యువజన సంఘాన్ని స్థాపించి అభివృద్ధి పనులకు నాంది పలికారని తెలిపారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి ముందు ఉండేవారన్నారు. గ్రామ విద్యార్థులను, తాను పనిచేసిన గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేశారన్నారు. చిన్న గ్రామమైన జన్కంపేట లో ఎంతోమంది ఉద్యోగాలు సాధించడానికి ప్రేరణగా నిలిచారన్నారు. అంతేగాక వేల్పూర్ మండలంలో చేపట్టిన బాల కార్మిక నిర్మూలన కార్యక్రమంలో తన వంతు పాత్ర పోషించి మండలంలో బాల కార్మికులను నిర్మూలించడానికి తోడ్పాటును అందించారన్నారు.

పాత్రికేయుడుగా ఉపాధ్యాయుడుగా ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా ఉండిపోతాయన్నారు. అనంతరం ఆయనను గ్రామస్తులు పూలమాల శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ సౌడ రమేష్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ కొలిప్యాక శ్రీనివాసరెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ సోమనరసింహారెడ్డి, స్నేహితులు సౌడ ప్రభాకర్ రావు, తలారి సుదర్శన్, ఉపాధ్యాయులు జూల దేవానంద్,సౌడ రవి, ఎడ్ల సీరిల్ రావు, జవ్వాజి శంకర్,సౌడ అరుణ్ రాజ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నీటిసమస్య పరిష్కారం

- ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



మాట్లాడుతున్న గ్రామస్తులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండలంలోని దేవక్కపేట్ గ్రామంలో నీటిసమస్య పరిష్కారమైంది. గ్రామంలోని నీటి సమస్యను ఆ గ్రామ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బాల్కొండ నియోజకవర్గ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే చొరవ తీసుకొని బోరు వేయించి, మోటార్ అందించారు. దీంతో గ్రామ నీటి సమస్యను తీరిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో నీటి సమస్యను గురించి తెలుపగానే ప్రత్యేక శ్రద్ధ చూయించి బోరు వేయించి నీటి సమస్యను, తీర్చినందుకు గ్రామ ప్రజలు, కార్యకర్తలు,నాయకులు ముత్యాల సునీల్ కుమార్ కు ధన్యవాదాలు తెలియజేశారు.

మోహన్‌కు సన్మానం



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిఎంపి అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పుల్గం మోహన్‌కు వైద్యసేవ రత్న బిరుదుని అందించారు. నూతన సంవత్సర ఉగాది సందర్భంగా మాక్లూర్‌లో విట్టలేశ్వర ఆలయంలో "మన సంస్కృతి స్వచ్ఛంద సంస్థ" వారు పుల్గం మోహన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రైల్వే జడ్జి బాలరాజు, స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు రఘునంద శర్మ, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గ ఎన్నికలు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ముదిరాజ్ సంఘం కార్యవర్గ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పట్టణ బిజెపి అధ్యక్షులు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన అధ్యక్షులు మందుల బాలు ముదిరాజ్ హాజరయ్యారు. ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు అధ్యక్షులుగా పడాల నరేష్, కార్యదర్శిగా వంశీ ఎన్నికయ్యారు. వీడీసీ సభ్యులుగా శ్యామ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కుమార్ ముదిరాజ్, ప్రసాద్, నవీన్, శ్రావణ్, మహేష్, గంగారాం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

అమీనాపూర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ మండలంలోని అమీనాపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా మంజూరైన సిసి రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.5లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన బాల్కొంతడ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ రెడ్డి, మంజూరు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ సభ్యుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేంపల్లి ఇంద్ర గౌడ్, వేంపల్లి లింగా గౌడ్, దేవల నవీన్, కిరణ్ గౌడ్, ఎల్క పల్లి మహేందర్, పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

- ఏఐకేఎంఎస్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న నాయకులు

వరి కోతలు ప్రారంభమయ్యాయని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లాలో వరి కోతలు పది పదిహేను రోజుల నుండి రైతులు ప్రారంభించిన ఇంతవరకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కపెడుతుందని, వెంటనే ప్రభుత్వం జిల్లాలో తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందని జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య కోరారు. సోమవారం అర్సపల్లిలో గౌరవ అధ్యక్షులు నాయక్ వాడి నర్సయ్య ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వరి కోత సీజన్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంలో ఆలస్యంవల్ల మార్కెట్లో దళారులు, వ్యాపారస్తులు ధాన్యానికి తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో రైతులు లక్షల రూపాయలు నష్టపోతున్నారని వారన్నారు. ఎంఎస్‌పి మద్దతు ధరలు రైతులకు అందక తీవ్ర నష్టాలకు గురవతున్నారని అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసే సంస్థలో పీఏసీసీఎస్, ఐకేపీ, ఎఫ్‌సీఐ, డ్వాక్రా సంఘాలు తద్వారా అమ్మక పోతే రైతులకు బోనస్ కూడ వచ్చే అవకాశం కూడా రాకుండా పోతుందని తెలిపారు. సంచికి 2 నుంచి 5 కిలోల తరుగు పేరుమీద కట్ చేస్తున్నారని, దీనివల్ల రైతులు దళారుల, వ్యాపారుల చేతుల్లో నిలువు దోపిడీకి గురవుతున్నారని వారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే తగినన్ని కొనుగోలుకేంద్రాలు జిల్లా అంతటా ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని రకాల ధాన్యానికి 500 బోనస్ లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఎఫ్‌పీఓలకు కూడా కొనుగోలు కేంద్రాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు నాయక్ వాడి నర్సయ్య, ఉపాధ్యక్షులు సాయిలు, గోపాల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ నవీపేట మండల కార్యదర్శిగా రాథోడ్ గోవింద్ ఎన్నిక

నవతెలంగాణ-నవీపేట్



మాట్లాడుతున్న నాయకులు

భారత విద్యార్థి ఫెడరేషన్ నవీపేట్ మండల కమిటీ ఎన్నికను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించగా మండల నూతన కార్యదర్శిగా రాథోడ్ గోవింద్ ను ఎన్నిక చేశారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విగ్నేష్ మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో విద్యాశాఖకు మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగం పూర్తిగా నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ పాఠశాలలకు, సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నవీపేట్ మండల అధ్యక్షులు కరణ్, మనోజ్, అరవింద్, సాయి కుమార్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వడ్లను ఏ రైస్ మిల్లుకు కేటాయించారో బహిర్గతపర్చాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

కోటగిరి సహకార సంఘం ద్వారా రైతుల వద్ద కొనుగోలు చేసిన వడ్లను ఏ రైస్ మిల్లుకు కేటాయించారో అధికారులు బహిర్గతపర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల సహకార సంఘం ద్వారా ఖరీఫ్ సీజన్లో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం కొనుగోలు చేసిన వడ్లను ఏ రైతు వద్ద వడ్లు తీసుకొని ఏ రైస్ మిల్‌కు ఎన్ని వడ్లు కేటాయించారో ట్రక్ షీట్‌లను సంబంధిత అధికారులు బహిర్గత పరచాలని డిమాండ్ చేశారు. బోనస్ ను రైతులకు కేటాయించాల్సి ఉండగా వారి పేర్లను మార్చి వ్యక్తిగతంగా కొద్దిమంది ఖాతాలో వేసుకోవడం క్షమించరానిదన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ సహకార సంఘం అధ్యక్షులు కూచిసిద్ధును వెంటనే సస్పెండ్ చేసి బోనస్ డబ్బులు తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాలని తెలిపారు. ఇట్టి ఘటనపై విజిలెన్స్ అధికారులతో విచారణ నిర్వహించి దోషులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిపిఐగా డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు హనుమాన్లు, సురేష్, రాధాకుమార్ పాల్గొన్నారు.

108 సిబ్బందికి వస్తువులు వితరణ

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో 108 సిబ్బందికి పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్, ప్రముఖ వ్యాపారవేత్త, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పురాం రాజమౌళి సోమవారం రైస్ కుక్కర్, సీలింగ్ ఫ్యాన్ వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆపద సమయంలో సరైన సమయానికి ఘటన స్థలానికి చేరుకొని ప్రమాద బారిన పడిన బాధితుల ప్రాణాలు కాపాడుతున్న 108 సిబ్బంది సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో 108 సిబ్బంది పాల్గొన్నారు.



వస్తువులు వితరణ చేస్తున్న దృశ్యం

మున్నూరు కాపు సంఘ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని పోసానిపేట శ్రీ రాజరాజేశ్వరి బండి మున్నూరు కాపు సంఘం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండి పరశురాం, కోశాధికారిగా బండి శ్రీకాంత్, కార్యదర్శిగా కనుగొందుల నర్సింలు, ఉపాధ్యక్షులుగా బండి నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం

ఆరోగ్యంగా.. ఆనందంగా గడపాలి

- జిల్లా ఎస్పీ ఎం.రాజేష్‌చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి

ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మిగిలిన జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర అన్నారు. సుదీర్ఘకాలం పోలీసు వ్యవస్థకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న పి.భూమయ్య ఎస్సైని కుటుంబ సమేతంగా జిల్లా పోలీసు కార్యాలయానికి ఆహ్వానించి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా కుటుంబ సభ్యుల సమక్షంలో భూమయ్య దంపతులకు జిల్లా ఎస్పీ పూలమాల వేసి శాలువాతో సత్కరించి బహుమతిని ప్రదానం చేసి అభినందించారు. ఎలాంటి రిమార్కులు లేకుండా సర్వీసును పూర్తి చేసి ఉద్యోగ విరమణ పొందడం అభినందనీయమని తెలిపారు.



ఎస్‌ఐ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు వ్యవస్థకు చేసిన సేవలు మరువలేనివని, కామారెడ్డి జిల్లా ప్రశాంత వాతావరణంలో ఉండడానికి ఒకప్పటి సంఘ విద్రోహ శక్తులతో పోరాటంలో తన వంతు పాత్ర పోషించినందుకు అభినందనలు తెలియజేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ సంతోషంగా జీవించాలని తెలియజేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1989వ సంవత్సరంలో భూమయ్య పోలీసు కానిస్టేబుల్‌గా జిల్లా పోలీసు వ్యవస్థలోకి అడుగుపెట్టి దాదాపు 36 సంవత్సరాల పాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి సోమవారం ఉద్యోగ విరమణ పొందారని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో తన వంతు పాత్రను పోషించారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన సర్వీసు మొత్తాన్ని ఎలాంటి రిమార్కులు లేకుండా పూర్తి చేసినందుకుగాను ప్రభుత్వం గుర్తించి రివార్డులతో గౌరవించిందన్నారు. ఎస్సై భూమయ్యను చివరగా జిల్లా ఎస్పీ, సిబ్బంది కరతాల ధ్వనులతో అభినందనలు తెలియజేసి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ తిరుపతయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, భూమయ్య, కుటుంబ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



కాంగ్రెస్ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలో ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా సోమవారం రాష్ట్ర మైనార్టీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ ఫతియుద్దీన్, ఐలాపూర్ తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డికి ముస్లిం సోదరులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఐలాపూర్ మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఫతియోద్దీన్‌తో పాటు శ్రీనివాస్ రెడ్డిని కమిటీ కార్యవర్గం శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఫతియోద్దీన్ మాట్లాడుతూ.. మసీదుల అభివృద్ధికై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుతో చర్చించి అభివృద్ధి నిధులు ఇప్పిస్తామన్నారు. అలాగే సోదరులు ప్రతిరోజు ఐదు పూటల నమాజ్ చదవాలని ఆయన మైనార్టీ సోదరులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా దిశ కమిటీ సభ్యులు రాజు దేశముఖ, లింగంపేట్ మైనార్టీ యువకులు ఆబేద్, సాజిద్, ఖాజా భాష, అర్షద్, రషీద్, హాసిముద్దీన్, గోహార్, నాసిరుద్దీన్, అక్మాల్, మొహమ్మద్ పాషా, షానవాజ్ ఖాన్, మన్సూర్ ఖాన్, ఆలం ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శెట్పల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని శెట్పల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించినట్టు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్ తెలిపారు. శెట్పల్లి గ్రామంలో ప్రధాన వీధుల్లో సిసి రోడ్డు లేక వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని శెట్పల్లి గ్రామానికి సిసి రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి రూ.10లక్షలు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నిధులు మంజూరు చేయించారు. దీంతో రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో దశలవారీగా సిసి రోడ్లు నిర్మాణం చేపట్టి గ్రామ రూపురేఖలు మార్చడానికి గ్రామానికి నిధులు మంజూరు చేయడానికి ఎమ్మెల్యే సానుకూలంగా ఉన్నారన్నారు. రూ.10 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్తులు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్, కాంగ్రెస్ నాయకులు అట్టెం శ్రీనివాస్, బాలయ్య, కృష్ణగౌడ్, రాజు, నగేష్, బైరయ్య, రవీందర్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు ప్రభుత్వం పెద్దపీట

- రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ముస్లింలకు రంజాన్ పండుగ కీలకమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో మైనార్టీ సోదరులతో కలిసి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గా వద్ద ఏర్పాటుచేసిన నమాజులో మైనార్టీలతో ఆయన పాల్గొన్నారు. అనంతరం పలు ముస్లిం సోదరుల ఆహ్వానం మేరకు వారి నివాసాలకు వెళ్లి ఆతిథ్యం స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 రోజులపాటు కఠోరమైనటువంటి ఉపవాస దీక్షలతో ఉన్నటువంటి మైనార్టీ సోదరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలకు పవిత్ర రంజాన్ చాలా కీలకమని ఉపవాస దీక్షల వలన ఎంతో మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు పెద్దపీట వేసిందన్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసి గజాజుద్దీన్, శ్రీనివాస్‌రెడ్డితో పాటు మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్ : ఐమాక్స్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



ఎల్లారెడ్డిలో..

నల్ల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు..

నాగిరెడ్డిపేట్ : మండల కేంద్రంలో గల నల్ల పోచమ్మ ఆలయంలో సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉగాది సందర్భంగా నల్ల పోచమ్మ ఆలయం వద్ద మూడు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందులో భాగంగానే రెండవ రోజున సోమవారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో సిసి రోడ్డు ఏర్పాటు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, క్రమశిక్షణ సంఘం సభ్యులు రామచంద్రరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరెడ్డి, గోపాల్‌పేట్ గ్రామ అధ్యక్షుడు శేఖర్, మైనార్టీ మండలాధ్యక్షుడు ఇమామ్, యూత్ అధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్, నియోజకవర్గ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గులాం హుస్సేన్, కోఆర్డినేటర్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రాగూర్, ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటరెడ్డి, నగేష్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఐమాక్స్ లైట్ ప్రారంభించిన ఎమ్మెల్యే..

మండల కేంద్రంలో గల నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని వారం రోజుల పాటు నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో వేలాది మంది భక్తులు రానున్నట్టు తెలిపారు. ఈ మేరకు భక్తుల సౌకర్యార్థం ఐమాక్స్ లైట్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి డివిటి కిష్టయ్య, గులాం హుస్సేన్, ఇమామ్, నరసింహారెడ్డి, పర్వత్రావు, సుధాకర్, షాయద్ పాషా, పాల్గొన్నారు.

రామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి రూ.51,000 విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని తిప్పారం తాండలో గల శ్రీశ్రీశ్రీ కోదండ రామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి తమవంతు సహాయంగా రూ.51,000 నగదును ఈ.కే బల్వంత్‌రావు పటేల్ తండ్రి రామారావు పటేల్ అందజేశారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బిషన్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ గంగారం, తాండవాసులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన పలువురు నాయకులు



కామారెడ్డి : శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి/సదాశివనగర్

రంజాన్ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీకి టిఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలు, తెలంగాణ జన సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కుంభాల లక్ష్మణ్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉన్నత పదవిని పొందాలని, ప్రజల శ్రేయస్సు కోసం మరింతగా కృషిచేయాలని ఆకాంక్షించారు.

సదాశివనగర్ : రంజాన్ పర్వదినం సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీకి కాంగ్రెస్ నాయకులు బంటు భూమేష్ సోమవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఇలియాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



సదాశివనగర్ : షబ్బీర్‌అలీని కలిసిన బంటు భూమేష్

నేడు బండ రామేశ్వర్‌పల్లిలో రక్తదాన శిబిరం

- విజయవంతం చేయాలి
- ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్
- జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలంలోని బండ రామేశ్వర్‌పల్లిలో రక్తదాన శిబిరాన్ని కామారెడ్డి రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్(ఐవీఎఫ్), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ బాశెట్టి, మీనా నాగరాజు సహకారంతో ఏర్పాటు చేయనున్నట్టు ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్దు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వేసవికాలం కావడం వలన రక్త నిల్వలు తగ్గిపోవడం జరిగిందని, దూర ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు రక్తం దొరకకపోవడంతో నిజామాబాద్ ఇతర ప్రాంతాలకు వెళ్లి తీసుకుని వచ్చే పరిస్థితి నెలకొని ఉందని అన్నారు. ప్రభుత్వ రక్తనిధి కేంద్రంలో రక్త నిల్వలు ఉంటే వాటిని ఉచితంగానే చికిత్స నిమిత్తం వచ్చిన రోగులు పొందవచ్చునని తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుట్ల అనిల్ కుమార్, ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, వెంకటరమణ, ఎర్రం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఎడ్ల బండ్ల ప్రదర్శన



ఎడ్లబండ్ల ప్రదర్శనలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో విశ్వావసు నూతన సంవత్సర ఉగాది పండగ వేడుకల్లో భాగంగా సోమవారం ఆలయాల చుట్టూ రైతులు ఎడ్లబండ్ల ప్రదర్శన చేయించారు. గ్రామ సమీపంలోని దేమీ కుర్దు శివారులో దశాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఉగాది రెండోవ దినంలో రైతులు అలంకరించిన ఎడ్ల బండ్లను మైసమ్మ, ఎల్లమ్మ, ఆలయాల చుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్ల బండ్లను అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించిన రైతులకు గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండారి సంజీవ్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, పీసు రాజిరెడ్డి, జంగల్దేమి రామచంద్రరావు, ఆనంద్‌రావు, రంజిత్, మంగలి స్వామి, చాకలి ఎర్రవటి రాజు, రాములు, యువజన సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు, చిట్యాల్, సోమారం, సంతాయిపేట్, తాడ్వాయి, తదితర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

జాతీయ మానవ హక్కుల కమిటీ కామారెడ్డి జిల్లా చైర్మన్ మహిపాల్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ మండలాల చైర్మన్‌లను, జనరల్ సెక్రటరీలను నియమిస్తూ వారికి నియామకపత్రాలను అందజేశారు. అనంతరం ఎన్‌హెచ్‌ఆర్‌సి సమావేశంలో ఎన్‌హెచ్‌ఆర్‌సి విధివిధానాలు తెలుపుతూ ప్రజా సమస్యలపై అధికారుల వద్దకు చేరేవిధంగా చూడాలని దొడ్డిదారిలో పనిచేస్తున్న అధికారులను ప్రశ్నించే విధంగా ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులు పనిచేయాలని ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా పనిచేయాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యులకు సూచించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సిని ప్రజల ముందుకు తీసుకువెళ్లే విధంగా కృషి చేయాలని కోరారు. ప్రజలకు ఉపయోగమైన పనులు చేయని మండల చైర్మన్‌లను తీసి వేస్తూ వారి స్థానంలో నూతన చైర్మన్‌లను నియమిస్తూ వారికి నియామకపత్రాలు అందజేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సందీప్, జనరల్ సెక్రెటరీ విజయభాస్కరరావు, నర్సింలు, జాయింట్ సెక్రెటరీ రాజిరెడ్డి, కన్వీనర్ రవీందర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ తేజశ్రీ, మీడియా కన్వీనర్ నారాయణ, మండల చైర్మన్ సభ్యులు పాల్గొన్నారు.



నియామకపత్రాలను అందజేస్తున్న జిల్లా చైర్మన్

ఢిల్లీకి తరలివెళ్లిన బీసీ సంఘాల నాయకులు



రైల్వే స్టేషన్‌లో నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని, తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ పార్లమెంట్ సమావేశంలో ప్రవేశపెట్టి బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి ఏప్రిల్ 2న ఢిల్లీలో జరిగే బీసీల పోరు గర్జన సభకు కామారెడ్డి నుంచి సోమవారం బయలుదేరినట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉప్పునూతుల నాగరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజర్వేషన్లు అమలు చేయడం ఒకరూ ఇచ్చే బిక్ష కాదని, ఇది బీసీల సామాజిక హక్కు అని తెలిపారు. బిసి రిజర్వేషన్లను ఖచ్చితంగా 42 శాతం ఇవ్వాల్సిందేనని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా కార్యక్రమానికి బయలుదేరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యవర్గము నాయకులు పాల్గొన్నారు.

ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని గాంధారి పట్టణ ముదిరాజ్ సంఘం సభ్యులు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా సంగని ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా అరిగే అంజయ్య, కోశాధికారిగా కావటి బాలయ్య, కార్యదర్శిగా తూర్పు రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం సభ్యులు తెలిపారు.



ఢిల్లీకి భారీగా తరలివెళ్లిన గౌడ కులస్తులు

- పాపన్న చరిత్ర చాటి చెప్పాలి : జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళిగౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

దేశవ్యాప్తంగా ఉన్న గౌడ్‌లను ఒక్క తాటిపైకి తెచ్చి వారందరి నోట పాపన్న మహారాజ్ చరిత్రను ప్రచారం చేయించే బృహత్తరమైన బాధ్యత మనందరిదని తెలియజేయడం కోసమే ఈ పాపన్న మహారాజ్ ఆత్మ బలిదాన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు జైగౌడ ఉద్యమం జిల్లా అధ్యక్షుడు రంగోల్ల మురళిగౌడ్ అన్నారు. ఢిల్లీలో ఏప్రిల్ రెండవ తేదీన కాన్సిట్యూషన్ క్లబ్‌లో జరిగే కార్యక్రమానికి కామారెడ్డి జిల్లా నుంచి భారీగా గౌడ సోదరులు తరలి వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



తరలివెళ్తున్న గౌడలు

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ముంబోజీపేట్ గ్రామానికి చెందిన మంజ సర్దార్‌కి సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును గ్రామ కాంగ్రెస్ నాయకులు అందజేశారు. గ్రామానికి చెందిన మంజ అనుబాయ్ ఆరోగ్యరీత్యా ఆస్పత్రిలో చూయించుకోవడంతో ఆ ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకుంది. రూ.27 వేలు మంజూరు కాగా చెక్కును బాధితురాలు భర్తకి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశానుసారం అందజేసినట్టు కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దశరథ్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు సభావాత్ రవి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రకాష్, మహేందర్, పూజారి వెంకటరామ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాల్యవివాహాలు, బాలికల అక్రమ రవాణాపై అవగాహన

నవతెలంగాణ కంఠేశ్వర్

సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కో ఆర్డినేటర్ మదుసుధన్ అధ్యక్షతన గంగపుత్ర సంఘంలో అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల బాలికల అక్రమ రవాణా, బాల బాలికలపై జరుగుతున్న హింస నిర్మూలనపై చర్చించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న గంగపుత్ర సంఘం పల్లికొండ అన్నయ్య మాట్లాడుతూ.. సాధన స్వచ్ఛంద సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు సహాయ సహకారాలు ఎల్లపుడూ ఉంటాయని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కలిగి ఉండాలన్నారు. చరణ్ సింగ్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు లేని జిల్లా మండలంగా తీర్చిదిద్దుటకు వ్యవస్థగా ఏర్పడి కలిసి పనిచేయాలన్నారు. బీసీటియు వినోద్ మాట్లాడుతూ.. చట్టలపై అవగాహనా పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నవిపెట్ కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ చరణ్ సింగ్, బింగల్ సిఎస్ఎం నిరీక్షణ, నగరంలోని అన్ని స్థానిక సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపెల్లి గ్రామంలో గల స్థానిక మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గణితం, బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, పొలిటికల్ సైన్స్ బోధించుటకు ఒక్కొక్క పోస్టుకు అర్హులైన మహిళ అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ అనూష తెలిపారు. సెట్ లేదా నెట్, పీహెచ్డీ ఉన్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఇది పూర్తిగా తాత్కాలిక పద్దతిలో చేపడుతున్న నియామకమని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏప్రిల్ 02న ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో కళాశాలలో ఇంటర్వ్యూ, డెమో కు హాజరు కావాలని పేర్కొన్నారు. కళాశాల చిరునామా ఓల్డ్ ఎస్ఆర్ఐటి బిల్డింగ్ మునిపల్లి అని పేర్కొన్నారు.

కల్లెడ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని కల్లెడి గ్రామ అభివృద్ధికి సంబంధించిన పనులకు 25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సోమవారం ప్రొసీడింగ్ కాపీలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు వినయ్ కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలూర్ కాంగ్రెస్ మండలం అధ్యక్షుడు ముక్కెర విజయ్, కల్లడి గ్రామ శాఖ అధ్యక్షుడు, శ్రీనివాస్ " నియోజకవర్గ యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కొండ్రా శివకృష్ణ, వీడీసీ అధ్యక్షుడు బార్ల ముత్యం, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల పోరుగర్జనకు తరలిన నాయకులు

జెండా ఊపి బస్సును ప్రారంభించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్



జెండాఊపి బస్సును ప్రారంభిస్తున్న నరాల సుధాకర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఏప్రిల్ రెండో తేదీన బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీల హక్కుల సాధనకు చేపట్టిన బీసీల పోరు గర్జనకు నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు సోమవారం చలో ఢిల్లీకి బయలుదేరారు. హైదరాబాద్ వరకు బస్సులో వెళ్లి అక్కడి నుండి రైలులో ఢిల్లీ వెళ్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులకోసం బస్సును ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరాల రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నినదించిన మేమెంతో మాకు అంత వాటా అనే నినాదంతో ఏప్రిల్ 2న ఢిల్లీలో బీసీల పోరు గర్జనలో పాల్గొనడానికి నిజామాబాద్ జిల్లా నుండి బీసీ సంక్షేమ సంఘం నాయకులు తరలివెళ్లారు. దేశవ్యాప్తంగా కులగనన చేపట్టాలని, తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో చేసిన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఈ పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల రెండున ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద బీసీ పోరు గర్జన పేరుతో ధర్నాకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నరాల రత్నాకర్ మాజీ కార్పొరేటర్ రఘువీర్ సింగ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నగర అధ్యక్షులు దర్శనం దేవేందర్ కొయ్యాడ శంకర్ శ్రీలత చంద్రకాంత్ సిరివేణు సంతోష్ వాల్మీకి నరేష్ మురళి అజయ్ వాసంజయ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సునీల్‌కుమార్

నవతెలంగాణ-మోర్తాడ్

జైబాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమం ఈనెల రెండో తేదీ నుండి గ్రామాలలో పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా నిలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ విలువలు దెబ్బతిన్నాయని రాజ్యాంగాన్ని కాపాడడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జైబాపు జైభీమ్ జైసంవిదాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల రెండో తేదీ నుండి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహిస్తూ బిజెపి ప్రభుత్వ అరాచకాలపై ప్రజలకు వివరిస్తూ రాజ్యాంగాన్ని కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజలకు వివరించాలని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మండల అధ్యక్షులు రాములు, దేవ రెడ్డి, కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సతయ్య వేణుగోపాల్ యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌సియు భూముల వేలాన్ని విరమించుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని విరమించుకోవాలని ఆందోళన చేసిన పిడిఎస్‌యు, ఇతర విద్యార్థి నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గిరిరాజ్ కళాశాల ముందు దహనం చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ 1973 లో ఆనాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ హైదరాబాద్ నగరానికి సెంట్రల్ యూనివర్సిటీ ఉంటుందని ప్రకటించారన్నారు. కానీ ఈరోజు ఇందిరా గాంధీ ఆశయాలు కొనసాగిస్తున్నామని చెప్తూనే, హెచ్.సి.యు భూములను అమ్మకానికి పెట్టడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకుంటుందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల భూములను అమ్ముకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని తెలియజేస్తుందన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పిడిఎస్‌యు అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి బీమ్ సేన్, ఇతర విద్యార్థి నాయకులపై పెట్టిన కేసులను ఎత్తివేసి, భేషరతుగా విడుదల చేయాలన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి అప్పగించిన 400 ఎకరాలను వెంటనే యూనివర్సిటీ పేరా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలన్నారు. విద్యా సంస్థల భూములను అమ్ముకునే వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని, లేనిచో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్యు నాయకులు వరుణ్, సాయి, రాజు, నవీన్, రాకేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- **ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రార్ధనలు**
- **ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపిన పలువురు నాయకులు**



కమ్మర్‌పల్లి : ప్రార్థనలు చేస్తున్న ముస్లింసోదరులు



బాల్కొండ: రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింసోదరులు



డిచ్‌పల్లి : రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

డిచ్‌పల్లి: ఈద్-ఉల్-ఫితర్ పండుగ సోమవారం ఘనంగా నిర్వహించారు. డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రలతో పాటు ఆయా గ్రామాల్లో ఈద్ ఉల్ ఫితర్ పండుగ కు ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి ఈద్గా వద్ద ఉదయం నుండి రాహదరి వెంట రాకపోకలు సాగించే డ్రైవర్లు, వాహనదారులు, ఆయా గ్రామాలకు చెందిన పలువురు ముస్లిం సోదరులు నమాజ్ కోసం ఈద్గాలకు నూతన వస్త్రాలు ధరించి తరలివచ్చి హఫీజ్ -ఎ- ఖురాన్ మౌల్విసాబ్‌లు అల్లాహ్ నిర్దేశించిన సూత్రాలను, రంజాన్ మాసంలో చేయవలసిన వాటిని చదివి వినిపించారు. నమాజ్ అనంతరం ఒకరినోకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాల వద్ద పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొని ముస్లిం సోదరులకు ఇద్ ముబారక్ తెలిపుకున్నారు. నమాజ్ అనంతరం తమ పూర్వీకుల సమాధుల వద్దకు వేళ్ళి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుని వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక దువ చేశారు. మహిళలు గృహాల్లోనే ఇద్ నమాజ్ ను పూర్తి చేసుకున్నారు. నమాజ్‌కు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా గ్రామాలకు చెందిన మాస్ జిద్ కమిటీ అద్వర్యంలో సకల సౌకర్యాలు ఏర్పాటుచేశారు. ఈద్గాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ అద్వర్యంలో ఓజు చేయడానికి నీటి ట్యాంకర్‌ను అందుబాటులో ఉంచారు. కార్యక్ర మంలో మస్‌జిద్ కమిటీ అధ్యక్షులు అహ్మద్ ఖురేషీ, ఖాజా మియా, మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ హుస్సేన్, షేక్ నయిమ్, హబీబ్, అబ్దుల్ గఫర్, షేక్ ఏజాజ్, అబ్దుల్ హమీద్,గఫర్ ఖురేషీ, అన్వర్ ఖురేషీ, హాఫిజ్ -ఏ-ఖురన్ షేక్ అమీర్, మహబూబ్ పటేల్, సయ్యద్ నయీమ్ షేక్ కరీం, మాలంగ్ తోపాటు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి ప్రార్థనలు చేస్తున్న ముస్లింసోదరులు

భీంగల్‌రూరల్ : మండలంలోని అయా గ్రామల ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి ఈద్గకు వెళ్లి పార్ధనలు చేశారు. మత పెద్దలు శాంతి సందేశాన్ని ఇచ్చారు. అనంతరం ఒక్కరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలకు అన్నదనాలు చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి భీంగల్ మండల కేంద్రంలో, బాబాపూర్ లో ముస్లిం మైనారిటీ సోదరులను కలిసి రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో కూర్చొని వారి బాగోగులు తెలుసుకున్నారు.

భీంగల్ రూరల్ : రంజాన్ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్ పిలుపు మేరకు రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల్ మోహన్ రెడ్డి మండలకేంద్రానికి వచ్చారు. ఈసందర్భంగా రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. భీంగల్ ప్రజల వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని, భీంగల్ మండలం కుటుంబంతో సమానమని అన్నారు. భీంగల్ నుండి పిలుపు వస్తే ఏ గ్రామానికి అయినా వచ్చేందుకు ముందుంటానని అన్నారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొదిరే స్వామి, కుంట రమేష్, నాగేంద్రబాబు, అనంతరావు, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండ : మండల పరిధిలోని గ్రామాలలో ముస్లింలు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బాల్కొండ, కిసాన్ నగర్ గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ పండుగ వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ బి.నరేష్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జక్రాన్‌పల్లి : రంజాన్ పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని ఈద్గావద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా మైనార్టీ సోదరులు ఈద్ నమాజ్ చేసుకున్నారు. ప్రజలందరూ క్షేమంగా ఉండాలని దువా చేసినట్టు మండల మాజీ కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్‌ఖాన్ తెలిపారు. ఈద్గావద్దకు ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వచ్చి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అర్గుల్ సింగిల్ విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగ్లా వసంతరావు , మండల మాజీ వైస్ ఎంపీపీ జితేందర్, మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్ టాక్సీ అక్బర్ , మండల మాజీ కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్ పాల్గొన్నారు.

ఏర్గట్ల: మండలంలోని ఏర్గట్ల, తొర్తి, గుమ్మిర్యాల్, నాగేంద్ర నగర్ గ్రామాల్లో ముస్లీంలు ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలను జరుపుకున్నారు. హిందువులను వారి ఇంటికి ఆహ్వానించి ఖీర్ అందించారు. వక్ఫ్ సవరణ బిల్లు నేపథ్యంలో చేతికి నల్ల రిబ్బన్ ధరించి మండలంలోని గుమ్మిర్యాల్, నాగేంద్ర నగర్ గ్రామానికి చెందిన ముస్లీంలు ఈద్ పండగను ఘనంగా జరుపుకున్నారు. నమాజ్ అనంతరం వారు మాట్లాడుతూ.. 2024 వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోవాలని, పార్లమెంట్‌లో ఆ బిల్లు ఆమోదం పొందితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని అన్నారు. కావున నల్ల రిబ్బన్ ధరించి నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బిల్లును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్మూర్ : మండలంలోని ఇస్సాపల్లి గ్రామంలో యుఆర్‌టిపి మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండి మహబూబ్ ఆధ్వర్యంలో సోమవారం రంజాన్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షురాలు కూరపాటి అరుణ జ్యోతి హాజరై మాట్లాడుతూ రంజాన్ పండుగ ముస్లిం సోదరులకు ఎంతో ముఖ్యమైన పండుగని అన్నారు. కార్యక్రమంలో, జిల్లా అధ్యక్షులు ఎర్ర రాకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు వేంపల్లి శ్రీనివాస్ గౌడ్, జిల్లా కార్యదర్శి భాగాయి శ్రీనివాస్, ఓబిసి జిల్లా అధ్యక్షురాలు నాగమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు లలిత, ఇసపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్మూర్: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంతో పాటు పలు గ్రామాలలో ముస్లిం సోదరులు దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగను సంతోషంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సమాజంలో ప్రేమ, శాంతి, ఐక్యతను చాటిచెప్పే ఈ పవిత్ర నెలలో ప్రజలు పరస్పర సహకారం, సౌహార్దంతో ఉండాలని పిలుపునిచ్చారు.



భీంగల్‌రూరల్ : రంజాన్ వేడుకలో పాల్గొన్న మానాల



ఏర్గట్లలో..



ఆర్మూర్‌లో..



జక్రాన్‌పల్లిలో...



భీంగల్‌రూరల్ : రంజాన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల

గుట్టను దోచుకుతిన్నారు..

- **కాంగ్రెస్ పార్టీ**

నవతెలంగాణ-మోర్తాడ్



మాట్లాడుతున్న వేణుగోపాల్‌యాదవ్

బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తన అనుచరులు కలిసి ఏర్గట్ల గ్రామ శివారులోని గుట్టను దోచుకుతిని ఇప్పుడు తన సొంత వ్యాపారం చేసుకుంటున్న బాల్కొండ నియోజకవర్గం ఇన్చార్జి అయిన సునీల్ రెడ్డిపై అప్పుడు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన సొంత వ్యాపార సంస్థల్లో జోక్యం చేసుకొని తనను అవమానించే విధంగా సోషల్ మీడియాలో తన అనుచరులతో ప్రశాంత్ రెడ్డి తప్పుడు ఆరోపణలను చేయిస్తున్నాడని, ఇలాంటి చిల్లర రాజకీయాలను మానుకోవాలని అన్నారు. నియోజకవర్గంలో గుట్టలు, చెరువులు వాగులను దోచుకున్న ప్రశాంత్ రెడ్డి తన అనుచరులు ప్రజలకు ఏమి సమాధానం చెప్తారని అన్నారు. వ్యాపార సంస్థలో నష్టాలు లాభాలు జరుగుతుంటాయని, అలాంటి సమయాల్లో తన సొంత వ్యాపార విషయాలలో వర్కర్లకు తనక జరిగిన ఘటనను వీడియో రూపంలో సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదని అన్నారు. కరోనా సమయంలో సైతం తన దగ్గర పనిచేసిన కార్మికులందరికీ వేతనాలు ఇచ్చిన వ్యక్తిపై తప్పుడు ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని అన్నారు. నియోజకవర్గంలోని ఏర్గట్ల గ్రామ శివారులో గల కంకర గుట్టను పూర్తిగా వ్యాపార సంస్థగా మార్చుకొని ప్రజాధనాన్ని దోచుకుతిన్న నాయకులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. పుష్కరాల సమయంలో పోలీసులను సైతం బూతులు తిట్టిన ప్రశాంత్ రెడ్డి ఇతరులపై తప్పుడు ఆరోపణలు చేయించడం సరికాదని అన్నారు. పది సంవత్సరాల కాలంలో తన అనుచరులు గ్రామ గ్రామాన ఏ మేరకు అరాచకాలు చేశారో తమకు తెలియదా.. బాల్కొండ నియోజకవర్గం యువతను గంజాయి అలవాటుకు గురి చేసిన ఘనత ప్రశాంత్ రెడ్డిదేనిని విమర్శించారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని లేని యెడల రాబోయే ఎన్నికల్లో ప్రశాంత్ రెడ్డికి ప్రజల గుణపాఠం చెప్పక తప్పదని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములు, డిసిసిబి డైరెక్టర్ భూమన్న శివన్నల శివకుమార్, మహిపాల్, మహిపాల్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌కు సన్మానం



బార్ ప్రెసిడెంట్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన మామిళ్ల సాయి రెడ్డిని నిజామాబాద్ సెంట్రల్ ఆర్మడ్ పోలీస్ ఫోర్స్ పర్సనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. అసోసియేషన్ డిస్టిక్ ప్రెసిడెంట్ కోరువ రమేష్, డిస్టిక్ట్ మాజీ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, అడ్వైజర్ బడుగు స్వామి, లింబాద్రి ఏకగ్రీవంగా సీనియర్ న్యాయవాదిని నగరంలోని ప్రైవేటు కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంరాజు, జి లక్ష్మీనారాయణ, శంకర్, రమేష్, తులసి ప్రసాద్ పాల్గొన్నారు.

హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం రాష్ట్ర స్థాయిలో ఆర్‌వీఎల్‌ఎల్‌బీఎస్ బసవ ప్రీమియర్ లీగ్హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ 2025 సీజన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23 నుంచి మే 1 వరకు కొనసాగుతాయని ఈ క్రికెట్ టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్‌లు జి.దినేష్ పాటిల్ అడ్వకేట్, శెట్టి శివకుమార్‌లు తెలిపారు. పెద్దఎక్లారలో ప్రచారంలో భాగంగా కరపత్రాలు పంపిణీ చేశారు. మొదటి బహుమతి రూ.55,555 ఉండగా, రెండవ బహుమతి రూ.22,222 ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్ 2 వరకు ఎంట్రీ చేసుకోవాలని కోరారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

మస్జిద్‌లో తాగునీరు ఏర్పాటు

నవతెలంగాణ-పోతంగల్

మండల కేంద్రంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని అతార్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మస్జిద్‌లలో తాగునీరు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సహకరించిన వెల్ఫేర్ యువత, పెద్దలు కుద్బుద్దీన్, దాదు సాబ్ ఖలీల్, ఫరీద్, షేక్ ఇలియాజ్ మొహమ్మద్, అమీర్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.


వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో తాగునీరు ఏర్పాటు చేసిన దృశ్యం


నిజాంసాగర్ : ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


నాగిరెడ్డిపేట్‌లో..



పిట్లం : కాంగ్రెస్ నాయకులకు సన్మానం

ఘనంగా రంజాన్

- ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింల అలయ్ బలయ్

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని అన్నీ గ్రామాల్లో రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పోతంగల్ : మండలంలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈద్ సందర్భంగా ముస్లింలు, హిందువులను తమ ఇంటికి ఆహ్వానిస్తారు.

కోటగిరి మండల కేంద్రంలోని రంజాన్ పండుగ సందర్భంగా మైనారిటీ సోదరులు జుబేర్ ఆహ్వానం మేరకు డీసీసీబీ మాజీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి వారి ఇంటికి వెళ్ళి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు. తెలుపుకొన్నారు. అనంతరం దానధర్మాలు కూడా చేశారు. మండలంలోని రంజాన్ పండుగను ధర్మారావుపేట్, అడ్లూరు ఎల్లారెడ్డి, పద్మాజివాడి, సదాశివనగర్, కల్వరాల్, ఉత్నూర్ తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను జరుపుకున్నారు.

లింగంపేట్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలలో మైనార్టీ సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాల వద్దకు వెళ్లారు. లింగంపేట్ మండల కేంద్రంలోని పెద్దవాగు సమీపంలో గల ఈద్గా వద్దకు డప్పు సప్పుళ్లతో మైనార్టీలు పెద్దఎత్తున బయలుదేరారు. అక్కడ గంటపాటు నమాజ్ చేశారు. ఈ సందర్భంగా మదర్సా నిర్వాహకులు అబుల్ హస్సన్ రిజ్వి మాట్లాడుతూ.. ముహమ్మద్ ప్రవక్త ప్రపంచ శాంతిని కోరాడన్నారు. ప్రతి ఒక్కరూ తన సంపాదనలో తోచినంత సాయం చేయాలన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయవాది మహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రి మసీదుకు సొంత డబ్బులతో పునర్నిర్మానానికి శ్రీకారం చుట్టినందుకు ఆయనను అభినందించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.

పిట్లం : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. రంజాన్ పండుగ సందర్భంగా కుటుంబ సమేతంగా నూతన వస్త్రాలు ధరించి ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం బంధుమిత్రులు, మత పెద్దలతో అలయ్ బలయ్ తీసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈద్గా వద్దకు వెళ్లి ముస్లిం సోదరులను ఆత్మీయ ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కాగా ముస్లిం సోదరులు సోదరా భావంతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముక్తి జంషెడ్, మజీద్ సదర్ యాదుల్, ఉపాధ్యక్షులు రబ్బాని, కార్యదర్శి అమీర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నజీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మోహన్‌రెడ్డి, రామ్‌రెడ్డి, హన్మాండ్లు, ఏనుగంఢ్ల శ్రీనివాస్‌రెడ్డి, చిప్ప శివ తదితరులు పాల్గొన్నారు.


రెంజల్ : చిన్నారుల అలయ్ బలయ్


సదాశివనగర్ : రంజాన్ వేడుకల్లో చిన్నారులు

ఘనంగా ఈద్-ఉల్-ఫితర్..

నాగిరెడ్డిపేట్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అలై బలై తీసుకున్నారు. నెలరోజుల నుండి ఉపవాస దీక్షలు నిర్వహించి సోమవారం పండగను జరుపుకున్నారు.

గాంధారి : మండల కేంద్రంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలైబలై చెప్పుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు..

భిక్కనూర్ : కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీకి పుష్పగుచ్ఛం అందజేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు భీమ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేష్, సీనియర్, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకులు లింబాద్రి, మైపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల నాయకులు జావిద్ పటేల్‌కు మీర్జాపూర్ హనుమాన్ టెంపుల్ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆలయ కమిటీ చైర్మన్ రామ్‌పటేల్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా చైర్మన్ రామ్ పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామికి మండల మైనార్టీ నాయకులు జావిద్ పటేల్ శాలువాలతో ఘనంగా సత్కరించారు.

నిజాంసాగర్ : నెల రోజులుగా ఉపవాస దీక్షలు చేసిన ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. నూతన వస్త్రాలను ధరించి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రంజాన్ మాసపు ఉపవాస దీక్షల ప్రార్థనలకు చివరి అంకమే ఈద్-ఉల్-ఫితార్ అన్నారు. సోదర భావం, సమానత్వం, సమైక్యత ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బాబు సెట్, మహ్మద్ మౌలానా, ఫాహీం, సర్దార్, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు రంజాన్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్దగుల్ల చండేగాం, నాగుల్‌గౌడ్, కత్తల్‌వాడి, బిజ్జల్‌వాడి, పెద్దఎడ్గి, చిన్నఎడ్గి, ఖండేబల్లూర్, కౌలాస్, మహమ్మదాబాద్, కంటాలి, గుండూర్, గ్రామాలలో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు అలైబలై చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

తాడ్వాయి : మండల కేంద్రంలో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. ఉదయమే కొత్త వస్త్రాలు ధరించి గ్రామ సమీపంలో గల ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూ ముస్లిం సోదరులు కలిసి మిఠాయిలు పంచుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి మహమ్మద్ చౌకత్ ఆలీ తెలిపారు. ఈ ఉత్సవాల్లో మహమ్మద్ రజాక్, మహమ్మద్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు గైని శివాజీ, లింగం, షబ్బీర్, అహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని కందకుర్తి గ్రామానికి చెందిన చిన్నారులు రంజాన్ పండుగను పురస్కరించుకొని ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలను చేశారు.

ఎడపల్లి : మండలంలోని కుర్నాపల్లి, అబయ్య దర్గా, జానకంపేట్, నెహ్రూనగర్, ఏఆర్‌పి క్యాంప్ గ్రామ సమీపంలోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రతేక ప్రార్థనలు చేశారు. ముస్లింలకు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ఎస్సై వంశీ కృష్ణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎస్సైని సన్మానించారు. రంజాన్ పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య ఘనంగా నిర్వహించారు.


పోతంగల్ (కోటగిరిలో)..



లింగంపేటలో..


జుక్కల్‌లో..


పోతంగల్‌లో..


తాడ్వాయిలో..


వర్నిలో..


ఎడపల్లిలో..

కేసీఆరే తెలంగాణకు శ్రీరామ రక్ష

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- బిఆర్ఎస్ పార్టీలో పలువురి చేరికలు
- కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే


బీఆర్ఎస్‌లో చేరుతున్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/భీంగల్‌రూరల్

కేసీఆరే తెలంగాణకు శ్రీరామ రక్ష అని...ప్రజల అండ ఉంటే ఈ రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగడుగున ప్రజల పక్షాన నిలదీస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ నాట్లు వేసేటప్పుడు రైతు బంధు వేస్తే, రేవంత్ రెడ్డి ఓట్ల అప్పుడు వేస్తున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊకదంపుడు బెదిరింపులకు, కేసులకు బయపడేవాళ్ళం కాదన్నారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలోని తన స్వగృహంలోని కార్యాలయంలో వివిధ పార్టీల నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆయన ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.... మోసపూరిత కాంగ్రెస్ పరిపాలనను గమనించి బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు, బాల్కొండ బహుజన సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నర్సయ్య, బీఎస్పీ బాల్కొండ ఇంచార్జ్ శ్రీనివాస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు. భీంగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ బోర్లా లింగం, మోర్తాడ్ సీనియర్ నాయకులు రంజిత్, సికింద్రాపూర్ పెద్దమ్మ కడి తండా సర్పంచ్ రమేష్ తదితరులు కాంగ్రెస్ పార్టీ నుండి తిరిగి బిఆర్ఎస్‌లో చేరారని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మోసపూరిత, కక్ష్యపూరిత పరిపాలన చేస్తుందని ఆరోపించారు. ఓట్ల కోసం ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి,ఆరు గ్యారంటీల ద్వారా అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. 100 రోజుల్లోనే హామీల అమలు అని, కొన్ని డిసెంబర్ 9 నాడే అమలు చేస్తాం అని, ఇప్పుడు 500 రోజులైన ఒక్క హామీ సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. రైతు బంధు బిఆర్ఎస్ పార్టీ ఎకరానికి సంవత్సరంకు రూ.10 వేలు ఇస్తే, మేము వస్తే రూ.15వేలు ఇస్తామని ఇప్పుడు రూ.12 వేలు చేశారన్నారు.ఆ రైతు బంధు కూడా యసంగికి గత ప్రభుత్వం రెడీగా ఉంచిన డబ్బులు పంచి, వానాకాలం పూర్తిగా ఎగ్గొట్టి ఇప్పుడు యసంగికి అరకొర మంది రైతులకు మాత్రమే వేశారని విమర్శించారు. రైతుబంధు మార్చి 31లోపు వేస్తానన్న రేవంత్ రెడ్డి, పంచాయతీ ఎలక్షన్లు వస్తున్నాయని ఇప్పుడు వేస్తున్నారన్నారు. కేసీఆర్ నాట్లు అప్పుడు రైతు బంధు వేస్తే, రేవంత్ రెడ్డి ఓట్ల అప్పుడు వేస్తున్నాడన్నారు.

ప్రతిరోజు ఆదివారం కాదు..

ప్రతిరోజు ఆదివారం కాదు.. ప్రతి రోజు మీది కాదు, కాంగ్రెస్ నాయకులు చెప్పినట్టుగా మా కార్యకర్తలను ఇబ్బంది పెడితే కాలం ఒకలా ఉండదు, అధికారం మారినప్పుడు ఆ పోలీసు అధికారి ఎవరైనా ఇబ్బంది పడాల్సి వస్తదని హెచ్చరించారు. అలాంటి అధికారుల పేర్లు అందరివి నోట్ చేసుకుంటున్నామని, పదవి విరమణ పొందిన సరే వారిని వదిలే ప్రసక్తే లేదని, కచ్చితంగా తగిన మూల్యం చెల్లిస్తామన్నారు. అధికారంలో లేకున్నా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న బిఆర్ఎస్ పార్టీలో చేరి ఇంకా బలాన్ని ఇచ్చిన అందరికి కృతజ్ఞతలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి అన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్ వెంకట్రావు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని గ్రామాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లా డుతూ.. గ్రామాలలో ప్రజలు ఊరికి వెళ్తున్నప్పుడు పోలీస్‌స్టేషన్‌లో ఒకరోజు ముం దుగా సమాచారం ఇవ్వాలన్నారు. కొత్త వ్యక్తులు గ్రామాలలో కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపా రు. అదేవిధంగా ఫోన్ ద్వారా ఓటిపి నంబర్లు, పిన్ నెంబర్లు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి తెలియజేయవద్దని, లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. బస్సు ప్రయాణాలు చేసేటప్పుడు జేబుదొంగలుంటారని బంగారు ఆభరణాలను, విలువైన వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు.

బాలుడు కిడ్నాప్, హత్య కేసును చేధించిన పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో కిడ్నాప్ అయిన బాలుడు మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ హత్య కేసును నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీసులు చేధించారు. కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. మార్చ్ 27 అర్ధరాత్రి అదృశ్యమైన బాలుడు మార్చి 28 సాయంత్రం నగరంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో హత్యకు గురయ్యాడు. మహారాష్ట్రలోని బిలోలికి చెందిన కాశీనాథ్ కమలాబాయి, గంగాధర్ అనే దంపతులు మార్చి 27న నిజామాబాద్‌కు భిక్షాటన కోసం వచ్చారు. వారి ఇద్దరు కూతుర్లు ఆర్టీసీ బస్టాండ్‌లో పడుకోగా.. తన కొడుకు కైలాస్ (14)తో కలిసి కమలాబాయి రైల్వే స్టేషన్ వద్ద పడుకుంది. రాత్రి 11 గంటలకు లేచి చూసేసరికి తన కుమారుడు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వన్ టౌన్ ఎస్హెచ్ఓ రఘుపతి దర్యాప్తు ప్రారంభించారు. సిసి ఫుటేజ్ ఆధారంగా నేరస్థులను గుర్తించారు. నిందితులిద్దరిని కోర్టులో హాజరు పరిచారు.

ఐదేండ్లలో వెయ్యికిపైగా బీఆర్ఓ సిబ్బంది, కార్మికులు మృతి

పార్లమెంటుకు కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ : బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) చేపట్టిన నిర్మాణ పనుల్లో చనిపోయిన సిబ్బంది, కార్మికుల సంఖ్యను కేంద్రం పార్లమెంటులో వెల్లడించింది. ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ ఈ వివరాలను వెల్లడించారు. 2020 నుంచి 2024 మధ్య మొత్తం 704 మంది బీఆర్ఓ సిబ్బంది, 575 మంది క్యాజువల్ పెయిడ్ లేబర్స్ (సీపీఎల్‌లు) మరణించారని చెప్పారు.

ఏమిటి ఈ బీఆర్ఓ?

బీఆర్ఓ అనేది రక్షణ మంత్రిత్వ శాఖ పరిధిలోని కీలకమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ. భారతదేశసరిహద్దు ప్రాంతాలలో రోడ్డు నెట్‌వర్క్‌లను నిర్మించటంలో, నిర్వహిం చటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవలి సంవత్సరాలలో ఇది లడఖ్‌లో 19,024 అడుగుల ఎత్తులో ప్రపంచంలోనే ఎత్తైన మోటారు వినియోగ రహదారి అయిన ఉమ్లింగ్ లా టాప్ రోడ్ వంటి అనేక సవాలుతో కూడిన ఎత్తైన మౌలిక సదు పాయాల ప్రాజెక్టును చేపట్టింది. అటల్ టన్నెల్, సెలా టన్నెల్, ఖార్దుంగ్ లా, చాంగ్ లా పాస్ రోడ్లు బీఆర్ఓ చేపట్టిన ఇతర ప్రాజెక్టులలో ఉన్నాయి.

మరణాల సంఖ్య ఇలా...

కేంద్ర మంత్రి తెలిపిన వివరాల ప్రకారం.. 2021లో బీఆర్ఓ సిబ్బంది 172 మంది, క్యాజువల్ పెయిడ్ లేబర్లలో 134 మంది చనిపోయారు. 2020లో ఇది వరుసగా 156, 112గా ఉన్నది. 2022లో 123 మంది బీఆర్ఓ సిబ్బంది, 100 మంది సీపీఎల్‌లు ప్రాణాలు కోల్పోయారు. 2023లో ఈ సంఖ్య వరుసగా 129, 119గా ఉన్నది. 2024లో, 124 మంది బీఆర్ఓ సిబ్బంది, 110 మంది సీపీఎల్‌లు మరణించారు. ఇక మొత్తం 166 మంది బీఆర్ఓ సిబ్బంది, సీపీఎల్‌లు గాయపడ్డారు.

తీసుకున్న చర్యలు ఇవి

ఈ ఐదేండ్లలో బీఆర్ఓ సిబ్బంది, కార్మికులకు సంబంధించిన 201 ప్రమాదాలు, ఇతర సంఘటనలు నమోదయ్యాయి. "బీఆర్ఓ అధిక ఎత్తు, సంఘర్షణలకు గురయ్యే ప్రాంతాలలో సిబ్బంది కోసం భద్రతా అంచనాను నిర్వహించింది. వీటిలో హిమపాతం సంభవించే ప్రాంతాల మ్యాపింగ్, పదునైన వక్రతలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాల గుర్తింపు, భద్రతా దళాలతో సమన్వయంతో తగిన రక్షణా ప్రోటోకాల్‌ను రూపొందించటం, పని ప్రదేశాల శిబిరాలు, సిబ్బంది భద్రత కోసం బంకర్లకు స్థానాలు వంటివి ఇందులో ఉన్నాయి" అని వివరించారు. బీఆర్ఓ సిబ్బంది, సీపీఎల్ లకు భద్రతా ప్రోటోకాల్‌లు, వైద్య సహాయం, పని పరిస్థితులను మెరుగుపర్చటానికి చర్యలు తీసుకున్నామని సేథ్ తెలిపారు.

తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతి

- మంచాల మండలం ఆరుట్లలో ఘటన



నవతెలంగాణ-మంచాల

ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుట్ల గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాశం బుచ్చయ్యగౌడ్ (58) రోజు మాదిరిగానే తాటిచెట్లు గీయడానికి సోమవారం ఉదయం చెట్ల వద్దకు వెళ్లాడు. కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా మోకు జారడంతో చెట్టు పై నుంచి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో బుచ్చయ్యగౌడ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. అప్పటికే బుచ్చయ్యగౌడ్ మృతిచెందాడు. విషయం తెలుసున్న మంచాల మండల పీఏసీఎస్ చైర్మెన్ వెదిరే హనుమంత్‌రెడ్డి, ఆరుట్ల మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కావలి శ్రీనివాస్ ప్రమాద స్థలికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. పరామర్శించిన వారిలో చీరాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు జెనిగే వెంకటేష్, పి.రమేష్, గ్రామస్తులు గుడ్డీమల చంద్రయ్య, పున్నము రాము, డాక్టర్ కొండిగారి బుచ్చయ్య, సుంకరి ప్రవీణ్‌గౌడ్, నూకం రాజు తదితరులు ఉన్నారు.

సామూహిక లైంగికదాడి కేసులో ఆరుగురి అరెస్ట్

- విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం : జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్



నవతెలంగాణ - ఊరుకొండ

నాగర్‌కర్నూల్ జిల్లా ఊరుకొండపేట శ్రీపబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో శనివారం రాత్రి మహిళపై జరిగిన సామూహిక లైంగికదాడి కేసులో ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దైవ దర్శనానికి వచ్చి రాత్రి సమయంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్లిన ఓ వివాహితను ఊరుకొండపేట గ్రామానికి చెందిన కొంతమంది బలవంతంగా లాక్కెళ్లి సామూహిక లైంగిక దాడి చేశారు. దీనిపై బాధితురాలి బంధువులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు. ఘటనా స్థలాన్ని జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్, కల్వకుర్తి సీఐ నాగార్జున, పోలీస్ సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ మాట్లాడుతూ.. ఓ మహిళపై ఏడుగురు లైంగికదాడి చేసినట్టు ఊరుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు వచ్చిందన్నారు. విచారణ చేపట్టి ఆరుగురు నిందితులు మహేష్ గౌడ్, హరీష్ గౌడ్, మారుపాకుల అంజి గౌడ్, మట్ట అంజి గౌడ్, మణికంఠ గౌడ్, సాధిక్ బాబాను అదుపులోకి తీసుకున్నామని, మరో నిందితుడు ఎల్లికట్ట కార్తీక్ గౌడ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. బాధితురాలి వెంట ఉన్న బంధువును దుండగులు కొట్టి కాళ్లు, చేతులు కట్టేశారని చెప్పారు. సామూహిక లైంగికదాడి అనంతరం దుండగులు బాధితురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారన్నారు. పూర్తి విచారణ అనంతరం నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సీతారామ ప్రాజెక్టు నిర్మాణంపై మంత్రి తుమ్మల వాస్తవాలు వెల్లడించాలి

తగిన నిధులు కేటాయించి త్వరగా పూర్తి చేయాలి

- నీళ్ల కేటాయింపులో జిల్లాకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోం
- గోదావరికి గండి ఎందుకు పెట్టారు..?
- ఏప్రిల్ 12న కొత్తగూడెంలో జిల్లా సదస్సు : భద్రాద్రి కొత్తగూడెం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-కొత్తగూడెం

సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంపై మంత్రి తుమ్మల వాస్తవాలు వెల్లడించాలని, తగిన నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా రైతాంగానికి నీళ్లు ఇచ్చిన తర్వాతనే ఇతర ప్రాంతాలకు తీసుకుని వెళ్ళాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగునీటి కోసం భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టిన సీపీఐ(ఎం).. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీళ్లు ఇవ్వకుండా తరలించే కుట్రలను చూస్తూ ఊరుకోదన్నారు. మంత్రి తుమ్మల గోదావరి జలాలు ఖమ్మం జిల్లాకు తీసుకువచ్చానని గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ దానివల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగంలో తీవ్ర ఆందోళన నెలకొందని అన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో జరుగుతున్న వాస్తవాలు వెలికి తీయడం కోసం పార్టీ జిల్లా నాయకత్వంతో కలిసి సీతారామ ప్రాజెక్టు నిర్మిస్తున్న కుమ్మరిగూడెం నుంచి జూలూరుపాడు వరకు ప్రాజెక్టు, పంప్ హౌస్‌లు, కాల్వలు పరిశీలించామని తెలిపారు. ఈ సందర్భంగా వెల్లడైన వాస్తవాలు మీడియాకు వివరించారు. మొదలు పెట్టిన ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాలేదని, పని మధ్యలోనే ఆగిపోయిందని, రిజర్వాయర్ లేకుండానే నీళ్లు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గోదావరి నదికి గండి కొట్టించి నీటిని సీతారామ కాలువకు మళ్ళించారని విమర్శించారు. ఈ నీళ్ళు దుమ్ముగూడెం ఆనకట్ట వల్ల హెవీ వాటర్ ప్లాంట్, మిషన్ భగీరథ, సింగరేణి అవసరాల కోసం నిల్వ ఉంచిన నీరని, గండి కొట్టడం వల్ల ఇప్పుడు పూర్తిగా అడుగంటి పోయాయని, తాగునీటికి కూడా కష్టాలు వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. ముఖ్యమంత్రిని తీసుకువచ్చి హడావుడిగా ప్రారంభించింది పంప్ హౌస్‌లు మాత్రమేనని చెప్పారు. గోదావరి జలాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతాంగానికి ఇవ్వడానికి ఎటువంటి పనులు చేపట్టలేదని పరిశీలనలో తెలిసిందని తెలిపారు. భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు నియోజకవర్గాలకు నీళ్ళు రాకుండా కుట్ర చేసి డిజైన్ మార్చారని ఆరోపించారు. ఇప్పటి వరకు కాలువల కోసం సేకరించిన రైతు భూములకు, నిర్వాసితులకు నష్టపరిహారం, పునరావాసం పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. జూలూరుపాడు వినోబానగర్ నుంచి సాగర్ కాలువకు నీటిని అక్రమంగా మళ్లించడం కోసం హడావుడిగా కాలువలు తవ్వారన్నారు. ఈ విషయాలు తాము గుర్తించామని వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు పెంచి ప్రాజెక్టు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న చెరువులకు పిల్ల కాల్వల ద్వారా అనుసంధానం చేస్తూ సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. పాత డిజైన్ ప్రకారం రోళ్ళపాడుకు నీళ్ళు ఇవ్వాలని కోరారు. దీనిపై ఏప్రిల్ 12న కొత్తగూడెంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని, జిల్లా రైతాంగం మొత్తం కదిలి రావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్త ఉద్యమానికి సీపీఐ(ఎం) శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే.రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణ

- ఎస్ఎల్‌బీసీ, టన్నెల్ ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి వెల్లడి



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో నిరంతరాయంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, కన్వేయర్ బెల్ట్ పునరుద్ధరణను వేగవంతం చేసినట్టు ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలిపారు. సహాయక చర్యలపై సోమవారం సహాయక సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షిస్తోందని, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, సింగరేణి మైన్స్ రెస్క్యూ దక్షిణ మధ్య రైల్వే బృందాలు ప్రతికూల పరిస్థితుల్లోనూ 24గంటల పాటు శ్రమిస్తున్నాయని వివరించారు. సహాయక బృందాలు, నిపుణులు సమన్వయంతో పనిచేస్తూ, మైనింగ్ ప్రమాదాల్లో నిష్ణాతులైన వారి సేవలను వినియోగించుకుంటూ ముందుకెళ్తున్నామని ప్రత్యేక అధికారి శివశంకర్ లోతేటి తెలియజేశారు. ప్రస్తుతం టన్నెల్‌లో కన్వేయర్ బెల్ట్‌ను 13,630 మీటర్ల నుంచి 13,730 వరకు(వంద మీటర్లు) పునరుద్ధరిస్తున్నట్టు, తద్వారా టన్నెల్ లోపల ఎస్కవేటర్ల సహాయంతో మట్టిని బయటికి తరలిస్తున్నట్టు తెలియజేశారు. టన్నెల్ లోపల సహాయక చర్యలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది కత్తిరించి లోకో ట్రైన్ ద్వారా బయటికి పంపిస్తోందని వివరించారు. ఊట నీటిని ప్రతిరోజూ అత్యధిక సామర్థ్యం గల పంపుల ద్వారా పంపింగ్ చేస్తున్నారన్నారు. సహాయక సిబ్బంది పండుగ రోజు కూడా పనుల్లో పాల్గొనడం అభినందనీయమని, వారి స్ఫూర్తిని ప్రశంసించారు. మట్టి తవ్వకాలకనుగుణంగా వెంటిలేషన్ పునరుద్ధరణ జరుగుతోందని, సహాయక సిబ్బందికి ఎటువంటి సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నాగర్‌కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవ సహాయం, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, హైడ్రా అధికారి సుదర్శన్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, సింగరేణి మైన్స్ రెస్క్యూ అధికారి, జేపీ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలి

- బీజేపీ ప్రభుత్వం మైనారిటీల హక్కులను హరించడానికి ప్రయత్నిస్తోంది : మత పెద్ద మౌలానా అతహర్ సాహెబ్
- నల్లబ్యాడ్జీలు ధరించి ముస్లిముల నిరసన



నవతెలంగాణ- సూర్యాపేట

వక్ఫ్‌బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే ప్రయత్నాలను వెంటనే ఉపసంహరించుకోవాలని మతపెద్ద మౌలానా అతహర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ఈదుల్ ఫితర్ నమాజ్‌కు ముందు మత పెద్ద మౌలానా అతహర్ సాహెబ్ బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిములు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మౌలానా అతహర్ సాహెబ్ మాట్లాడుతూ.. వక్ఫ్ స్థలాలు ఎవరి వ్యక్తిగత సొత్తు కాదని, అవి తరతరాలుగా ముస్లిముల ఆధీనంలో ఉన్నాయని స్పష్టం చేశారు. వక్ఫ్ బిల్లును పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దీనిని అడ్డుకోవడానికి ఆలిండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు కృషి చేస్తోందని తెలిపారు. బీజేపీ ప్రభుత్వం మైనారిటీల హక్కులను హరించడానికి ప్రయత్నిస్తోందని, ముస్లిముల ఆస్తులను హరించడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, బీహార్ సీఎం నితీష్‌కుమార్ మద్దతుతో అధికారంలోకి వచ్చిన బీజేపీ, ఇటువంటి నిర్ణయాలతో ముస్లింల వ్యతిరేకతను ఎదుర్కొంటోందన్నారు. చిన్నాచితక పార్టీల మద్దతుతో నిలదొక్కుకున్న బీజేపీ ప్రభుత్వం త్వరలోనే పతనమవుతుందని హెచ్చరించారు. బీజేపీ ప్రభుత్వం ముస్లిముల ఆస్తులను స్వాధీనం చేసుకోవడం ద్వారా వారిని ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రధానంగా వక్ఫ్ బిల్లు పాసైతే రానున్న కాలంలో వక్ఫ్ స్థలాలను బలవంతంగా లాక్కుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా ఏదైనా వక్ఫ్ స్థలం, మజీద్, ఖబరస్తాన్, మదర్సాల విషయంలో చిన్న చిన్న ఫిర్యాదులొస్తే కలెక్టర్ వాటిని స్వాధీనం చేసుకునే అధికారం కల్పిస్తారన్నారు. ముస్లిములంతా ఐక్యంగా ఉండి, తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

నెల్గోర కొండల్లో ఎన్‌కౌంటర్

- రూ.45 లక్షల రివార్డు గల మహిళా మావోయిస్టు మృతి
- మృతురాలు వరంగల్ వాసి గుమ్మడివేలి రేణుక అలియాస్ దమయంతి అలియాస్ సరస్వతిగా గుర్తించిన పోలీసులు





(ఫైల్)

నవతెలంగాణ-చెర్ల

ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు గీదం పోలీస్ స్టేషన్ పరిధి నెల్గోర, ఇకెలి, బెల్నార్ గ్రామాల మధ్య అటవీ కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో రూ.45 లక్షల రివార్డు (ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూ.25 లక్షలు, తెలంగాణ ప్రభుత్వం రూ.20 లక్షలు) గల సెంట్రల్ రీజనల్ బ్యూరో (సీఆర్‌బీ) ప్రెస్ టీమ్ ఇన్‌చార్జి, ప్రభాత్ పత్రిక ఎడిటర్ గుమ్మడివేలి రేణుక అలియాస్ సరస్వతి అలియాస్ దమయంతి అలియాస్ భాను అలియాస్ చైతే మృతి చెందినట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. బెల్నార్, నెల్గోర, ఇకెలి, బెల్నార్ గ్రామం మధ్య ఉన్న దండకారణ్య గుట్టల్లో మావోయిస్టు హై క్యాడర్ ఉన్నారనే నిఘా సంస్థలు ఇచ్చిన సమాచారం ఆధారంగా బస్తర్ ఫైటర్స్, ఎస్‌టీఎఫ్, డీఆర్‌జీ బలగాలు బయలుదేరినట్టు దంతెవాడ పోలీస్ సూపరింటెండెంట్ గౌరవ్ రాయ్ తెలిపారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, దంతెవాడ రేంజ్ కమ్లోచన్ కశ్యప్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సమయంలో సోమవారం ఉదయం 9 గంటలకు పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు ప్రారంభమై సుమారు రెండు గంటల పాటు హోరాహోరీగా కొనసాగిందని అన్నారు. కాల్పుల అనంతరం ఒక మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

మృతిరాలి వివరాలు బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, సుందర్‌రాజ్ వెల్లడించారు. మృతురాలు గుమ్మడివేలి రేణుక మావోయిస్టు పార్టీలో సెంట్రల్ రీజనల్ ప్రెస్ టీమ్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. ఆమె ఎల్ఎల్‌బీ చేశారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా దేవరపల్లి కడవెండి గ్రామానికి చెందిన ఆమె 1996లో నక్సల్స్ పార్టీలో చేరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్‌జెడ్‌సీ ఎం.కృష్ణతో కలిసి పనిచేశారు. 2003లో డీవీసీఎంగా పదోన్నతి పొందారు. 2006లో సౌత్ బస్తర్‌లో సీసీఎం దులా దాదా అలియాస్ ఆనంద్‌తో కలిసి పనిచేశారు. 2013లో మాడ్ ప్రాంతానికి వచ్చి ఎస్‌జెడ్‌సీఎం రామన్నతో కలిసి పనిచేశారు. 2020లో రామన్న కరోనాతో మరణించిన తర్వాత, డీకేఎస్‌సీఎం సెంట్రల్ రీజనల్ బ్యూరో ప్రెస్ టీం ఇన్‌చార్జిగా నియమించబడ్డారు. మావోయిస్టు పార్టీ తరపున ఆమె పత్రికా ప్రకటనలు జారీ చేయడంతోపాటు ప్రభాత్, మహిళా మార్గం, అవామీ జంగ్, పీపుల్స్ మార్చ్, పొడియారో పోలో, ఝుంకార్, సంఘరత్ మహిళ, పితూరి, మిడంగూర్, భూమ్‌కల్ సందేశ్ వంటి పలు పత్రికలను ముద్రించి ప్రచురించేవారని ఐజీ వివరించారు. ఆమె సోదరుడు ఎస్‌జెడ్‌సీఎం జీవీకే ప్రసాద్ అలియాస్ సుఖ్‌దేవ్ అలియాస్ గుడ్సా ఉసెండి 2014లో తెలంగాణలో లొంగిపోయాడు. 2010 నల్లమల్ల ఎన్‌కౌంటర్ (ఆంధ్రప్రదేశ్)లో మరణించిన కేంద్ర కమిటీ సభ్యుడు (సీసీఎం) శంకమూరి అప్పారావు అలియాస్ రవితో 2005లో ఈమెకు వివాహం అయింది. ఘటనా స్థలం నుంచి ఐఎన్‌ఎస్‌ఏఎస్ రైఫిల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రి, ల్యాప్‌టాప్, మావోయిస్టు సాహిత్య, దైనందిక సామగ్రి స్వాధీనపరచుకున్నట్టు ఎస్పీ తెలిపారు.

ఎంపీ వద్దిరాజుకు టీడబ్ల్యూజేఎఫ్ సన్మానం

- రాజ్యసభలో జర్నలిస్టుల రైల్వేపాస్‌లపై స్పందించినందుకు కృతజ్ఞతలు
- రైల్వేమంత్రిని ఒప్పించి పాస్‌లు పునరుద్ధరించేలా కృషి చేస్తానని ఎంపీ హామీ
- జర్నలిస్టుల సమస్యపై వినతి ఇచ్చినందుకు టీడబ్ల్యూజేఎఫ్‌కూ ఎంపీ అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా కమిటీ విజ్ఞప్తిని పార్లమెంటులో ప్రస్తావించినందుకు ఎంపీ వద్దిరాజు రవిచంద్రకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఖమ్మంలోని ఎంపీ స్వగృహంలో సోమవారం ఆయన్ను కలిసి కృతజ్ఞత పూర్వకంగా శాలువా కప్పి సన్మానించారు. రాజ్యసభలో ప్రస్తావించడంతో పాటు రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేయటంపై ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల విషయంలో తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. తన విజ్ఞప్తిపై రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇప్పటికే రైల్వే టికెట్లలో ప్రజలందరికీ భారీ రాయితీలు ఉన్నాయని రైల్వే మంత్రి ప్రస్తావించినట్టు చెప్పారు. అయినా ఆ ఉన్న టికెట్లపై జర్నలిస్టులకు ఇచ్చిన రాయితీని పునరుద్ధరించాల్సిందేనని తాను కోరినట్టు ఎంపీ తెలిపారు. అవసరమైతే ఈ విషయంలో మిగతా ఎంపీలతో కలసి సమస్య పరిష్కారం అయ్యేవరకూ కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. తెలంగాణ వ్యాప్తంగా 25 వేల మందికి పైగా జర్నలిస్టులు, దేశవ్యాప్తంగా లక్షల్లో ఉన్న జర్నలిస్టులు ఈ రైల్వే రాయితీని కోవిడ్ అప్పటి నుంచి కోల్పోతున్నారన్న విషయాన్ని తాను రాజ్యసభలో టీడబ్ల్యూజేఎఫ్ ఇచ్చిన వినతినే ప్రస్తావించానని, రైల్వే పాస్‌లను పునరుద్ధరించాల్సిందేనని కోరినట్టు తెలిపారు. వినతిపత్రం ఇచ్చినందుకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీని ఎంపీ అభినందించారు. ఎంపీని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, ఆవుల శ్రీనివాస్, వెగినాటి మాధవరావు, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దుబ్బాకుల శ్రీను, కానంగి భిక్షం తదితరులు ఉన్నారు.

Hungama OTTలో ఆకట్టుకునే థ్రిల్లర్ ఎవరు ఎప్పుడు ఎక్కడ ప్రీమియర్‌లు

నవతెలంగాణ : భారతదేశంలోని ప్రముఖ డిజిటల్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటైన Hungama OTT, దాని తాజా తెలుగు ఒరిజినల్ సిరీస్, ఎవరు ఎప్పుడూ ఎక్కడ (హిందీ: 'కబ్ క్యూం ఔర్ కహాన్')తో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధంగా ఉంది, ఇది మోసం, రహస్యాలు మరియు కుట్రల ద్వారా ప్రేక్షకులను తీవ్రమైన ప్రయాణంలో తీసుకెళ్లే ఒక ఉత్కంఠభరితమైన క్రైమ్-థ్రిల్లర్. PS రావు దర్శకత్వం వహించి, K3 సినీ క్రియేషన్ బ్యానర్‌పై పి. శ్రీనివాసప్ప నిర్మించిన ఈ భారీ అంచనాలున్న సిరీస్, 27 మార్చి 2025న హంగామా OTTలో ప్రత్యేకంగా ప్రీమియర్ అవుతుంది. ధన్య బాలకృష్ణన్, అషు రెడ్డి, కౌశల్ మంద, రోహిణి, రామ్ ప్రసాద్ మరియు PS రావు కీలక పాత్రల్లో నటించిన ఎవరు ఎప్పుడూ ఎక్కడ, దాని సంక్లిష్టమైన కథాంశానికి ప్రాణం పోసే ఆకర్షణీయమైన ప్రదర్శనలను అందిస్తుంది.

జీరో రెఫరల్ ఫీజులను ప్రకటించిన అమెజాన్

నవతెలంగాణ : దేశవ్యాప్తంగా Amazon.inలో అమ్మకాలు చేసే లక్షలాది చిన్న వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి అమెజాన్ ఇండియా నేడు విక్రేత రుసుములలో అత్యధిక తగ్గింపును ప్రకటించింది. Amazon.inలో విక్రేతల వృద్ధిని మరింత పెంచే లక్ష్యంతో, కంపెనీ రూ. 300 కంటే తక్కువ ధర ఉన్న 1.2 కోట్లకు పైగా ఉత్పత్తులపై సున్నా రిఫెరల్ ఫీజులను ప్రవేశపెట్టింది. రిఫెరల్ ఫీజులు అంటే అమ్మిన ప్రతి ఉత్పత్తికి విక్రేతలు అమెజాన్‌కు చెల్లించే కమిషన్. 135 కంటే ఎక్కువ ఉత్పత్తి విభాగాలకు సున్నా రిఫెరల్ ఫీజులు వర్తిస్తాయి. అమెజాన్ ఈజీ షిప్ మరియు సెల్లర్ ఫ్లెక్స్ వంటి బాహ్య ఫుల్‌ఫిల్‌మెంట్ ఛానెల్‌లను ఉపయోగించే విక్రేతల కోసం సరళీకృత ఫ్లాట్ రేట్‌ను కూడా తీసుకువచ్చింది, జాతీయ షిప్పింగ్ రేట్లు ఇప్పుడు రూ. 65 నుండి ప్రారంభమవుతాయి, వీటిని రూ. 77 నుండి తగ్గించారు. ఈజీ షిప్ అనేది ఒక ఫుల్‌ఫిల్‌మెంట్ ఛానెల్ అయితే, అమెజాన్ సెల్లర్ ఫ్లెక్స్‌లో భాగంగా సెల్లర్స్ వేర్‌హౌస్‌లో కొంత భాగాన్ని అమెజాన్ ఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌గా నిర్వహిస్తుంది.

ఆయుర్వేదం ఆధారంగా మారుతున్న కాలానికి 7 రోజుల ఆహార ప్రణాళిక

- డాక్టర్ మధుమిత కృష్ణన్, ఆయుర్వేద నిపుణులు

నవతెలంగాణ : మనం శీతాకాలం నుండి వసంతకాలం (సంధికాల) కు మారుతున్నప్పుడు, కాలానుగుణ అనారోగ్య సమస్యలను నివారించడానికి సమతుల్య ఆహారం యొక్క ప్రాముఖ్యతను ఆయుర్వేదం నొక్కి చెబుతుంది. ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులు జీర్ణక్రియను బలహీనపరుస్తాయి, రోగనిరోధక శక్తిని తగ్గిస్తాయి. ఈ దశలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, సరి అయిన ఆహారం తీసుకోవడం అవసరం. ఆయుర్వేద నిపుణులుగా, ఇంట్లో తయారుచేసిన నెయ్యి, కూరగాయల సూప్‌లు, ఆకుకూరలు , బాదం వంటి ప్రోటీన్ యొక్క సహజ వనరును మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నేను సిఫార్సు చేస్తున్నాను. ఏడు రోజుల ఆయుర్వేద ఆహారం సీజన్ తో పాటుగా వచ్చే వ్యాధులను దూరంగా ఉంచుతూ పోషకమైన, రుచికరమైన భోజనాన్ని ఆస్వాదించడంలో మీకు సహాయపడుతుంది. ఈ దిగువ ప్రభావవంతమైన భోజన ప్రణాళిక ఉంది. ప్రతి ఒక్కరి శరీరం భిన్నంగా ఉంటుంది, కాబట్టి మీ వ్యక్తిగత అవసరాల ఆధారంగా మీరు తీసుకునే ఆహార సర్దుబాటు చేసుకోవడానికి సంకోచించకండి.